

గంగవరం పోర్టులో అగ్ని ప్రమాదం

వివరాలు వెల్లడించని సంస్థ

గంగవరం పోర్టులో ఆదివారం రాత్రి ప్రమాదం జరిగింది. వెల్డింగ్ పనులు చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిసిపడి 13వ నంబరు కన్వేయర్ బెల్టులకు మంటలు అంటుకున్నాయి.



... వివరాలు మెయిన్‌లో

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ



వైద్యం కోసం వెళితే ఇల్లు గుల్లే

- ఇదీ నగరంలోని కొన్ని ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో పరిస్థితి
- రూ.లక్షల్లో బిల్లులు
- జలగల్లా ఆస్పత్రుల యాజమాన్యాలు
- రోగికి అందించే వైద్యంపై గోప్యత
- ఆఖరి నిమిషంలో చేతులెత్తేస్తున్న వైనం
- ఆరోగ్యశ్రీ పథకం లబ్ధిదారుల నుంచీ అదనంగా వసూలు
- పట్టించుకోని ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలోని కొన్ని ప్రైవేటు/కార్పొరేటర్ ఆస్పత్రులు కాసుల కక్కుర్తితో రోగుల ప్రాణాలతో ఆడుకుంటున్నాయి. వైద్య సేవల పేరుతో అందినకాడికి దోచుకుంటున్నాయి. రోగి కండిషన్ చెప్పకుండా లక్షల రూపాయలు తీసుకుంటూ...చివరి నిమిషంలో హడావిడి చేసి మరో ఆస్పత్రికి రిఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నాయి.

నగరంలోని హెచ్‌బీ కాలనీకి చెందిన రామ్‌కుమార్ భార్య కొద్దిరోజులు కిందట బిడ్డకు జన్మనిచ్చింది. ఆరోగ్య పరిస్థితి బాగుండకపోవడంతో జిల్లా పరిషత్ సమీపంలోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. వారం రోజుల నుంచి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతోందని వైద్యులు చెప్పారు. సుమారు నాలుగు లక్షల వరకు బిల్లు చేశారు. ఆ తరువాత బేబీ పరిస్థితి ఇబ్బందిగా మారిందంటూ హుటాహుటిన మరో ఆస్పత్రికి మార్పించారు. బిల్లు పూర్తిగా చెల్లిస్తేగానీ డిశ్చార్జ్ ఇవ్వలేదు. ఆస్పత్రి మార్చిన తరువాత అసలు విషయం తల్లిదండ్రులకు తెలిసింది. బేబీ కండిషన్ ముందు నుంచీ బాగాలేదని....

వెన్ను సంబంధిత సమస్యతో బాధపడుతున్న రాజారావు హెల్త్‌సిటీలోని ప్రముఖ ఆస్పత్రిలో చేరారు. ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్రచికిత్స చేస్తామని వైద్యులు తెలిపారు. అయితే ఈ పథకంలో అందించే పరికరాల నాణ్యత బాగుండదంటూ సుమారు మూడు లక్షల రూపాయల వరకూ అదనంగా వసూలు చేశారు.

నగరంలోని పలు ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల దందాకు అడ్డులేకుండాపోతోంది. ఆస్పత్రిలో చేరిన రోగి నుంచి ఎంత వీలైతే అంత దోచేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. చిన్నపాటి సమస్యతో వెళ్లినా అనేక పరీక్షలు చేసి రోగుల నుంచి అందినకాడికి పిండుకుంటున్నారు. పొరపాటున ఆరోగ్యం ఇబ్బందిగా ఉండి ఆస్పత్రిలో చేరాల్సి వస్తే... పరిస్థితి మరింత దారుణం. రూ.లక్షలు వసూలు చేస్తున్నారు.

ఇటీవల ఈ తరహా ఉదంతాలు భారీగా వెలుగుచూస్తున్నాయి. రోజుల తరబడి వైద్యం చేయడం, రూ.లక్షలు వసూలు చేయడం, చివరి నిమిషంలో అత్యవసర వైద్యం పేరుతో మరో ఆస్పత్రికి తరలించేసి చేతులు దులుపుకోవడం కార్పొరేట్ ఆస్పత్రులకు పరిపాటిగా మారింది. ఈ ఆస్పత్రుల్లో జరుగుతున్న వ్యవహారాలను నిత్యం పర్యవేక్షించాల్సిన ఆరోగ్యశాఖ అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ... మిగతా 6వ పేజీలో

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

అదనంగా అందుబాటులోకి 117 థర్డ్ ఏసీ బెర్తులు

- సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగింపు

విశాఖపట్నం, జూలై 22:



విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్లే గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739) మంగళవారం కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో బయలుదేరనుంది. ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) రేక్ స్థానంలో లింక్ హాఫ్‌మన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లతో సోమవారం సికింద్రాబాద్‌లో బయలుదేరిన గరీబ్‌రథ్ మంగళవారం ఉదయం విశాఖ చేరుకోనున్నది. ఇక్కడ నుంచి రాత్రి 8.40 గంటలకు తిరిగి సికింద్రాబాద్ బయలుదేరనున్నది.

జనరేటర్ మోటార్ కోచ్‌లతో మొత్తం 20 కోచ్‌లు

ఇప్పటివరకూ 17 థర్డ్ ఏసీ, రెండు జనరేటర్ మోటారు కోచ్‌లతో కలిపి 19 కోచ్‌లతో (ఐసీఎఫ్ రేక్) రాకపోకలు సాగించిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్...మంగళవారం నుంచి 18 థర్డ్ ఏసీ ఎకానమీ ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడవనుంది. గతంలో కోచ్‌కు 81 బెర్తులు చొప్పున 17 కోచ్‌లకుగాను 1,377 థర్డ్ ఏసీ బెర్తులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ఎల్‌హెచ్‌బీ రేక్ ద్వారా కోచ్‌కు 83 చొప్పున 18 కోచ్‌లకుగాను 1,494 బెర్త్‌లు అందుబాటులోకి వచ్చాయి. గతంకంటే మరో 117 బెర్తులు జత కానున్నాయి.

సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగింపు

ఇప్పటివరకూ ఐసీఎఫ్ రేక్‌తో నడిచిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లో సైడ్ విండో మిడల్ బెర్తులు ఉండేవి. ఇరుకుగా ఉండే ఈ బెర్తు చిన్న పిల్లలకు మినహా మిగిలిన వారికి సౌకర్యకరంగా ఉండేది కాదని అభిప్రాయాలున్నాయి. తప్పనిసరి పరిస్థితులలో ఇబ్బందికరంగా ప్రయాణించేవారు. సైడ్ మిడిల్ బెర్తులను తొలగించాలని ప్రయాణికులు రైల్వే శాఖకు విజ్ఞప్తి చేసిన సందర్భాలున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఆధునిక ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో సైడ్ విండో మిడిల్ బెర్తు తొలగించారు. ఇతర రైళ్లలోని థర్డ్ ఏసీ ... మిగతా 6వ పేజీలో

సవాళ్లు అనేకం

జీవీఎంసీ నూతన కమిషనర్‌కు సమస్యల స్వాగతం

- గత కమిషనర్ తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలపై ఇప్పటికే కోర్టుల్లో కేసులు
- మరోవైపు కౌన్సిల్‌లో మారుతున్న రాజకీయ పార్టీల బలాబలాలు
- అన్నింటినీ అధిగమిస్తూనే నగరాభివృద్ధిపై దృష్టిపెట్టాల్సిన పరిస్థితి
- జీవీఎంసీ కమిషనర్‌గా సంపత్‌కుమార్ నేడు బాధ్యతలు స్వీకరణ



సంపత్‌కుమార్

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ కమిషనర్‌గా నియమితులైన పి.సంపత్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. నూతన కమిషనర్‌కు అనేక సవాళ్లు స్వాగతం పలుకుతున్నాయి. కమిషనర్‌గా ఇప్పటి వరకూ పనిచేసిన సాయికాంత్‌వర్మ తీసుకున్న పలు నిర్ణయాలు వివాదాస్పదంగా మారాయి. వీటిపై హైకోర్టులో పిటిషన్లు కూడా దాఖలు చేయడంతో కేసులు నడుస్తున్నాయి.

గత కమిషనర్ సాయికాంత్‌వర్మ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆపార్టీ నేతల ఆదేశాలకు అనుగుణంగా కొన్ని నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. సిరిపురం జంక్షన్‌లోని సీబీసీఎన్‌సీ భూమిపై వివాదం నడుస్తున్నప్పటికీ అక్కడ భవన నిర్మాణాలకు అనుమతి ఇచ్చారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఆ స్థలంలో కొంత భూమి భవిష్యత్తులో రోడ్డు విస్తరణలో పోతుందని రూ.65 కోట్లు టీడీఆర్‌ను జారీచేశారు. వైసీపీ అధికారం కోల్పోయిన తర్వాత దీనిపై కొంతమంది కోర్టును ఆశ్రయించడంతో సీబీసీఎన్‌సీ భూమిలో నిర్మాణ పనులను ఆపాలంటూ బదిలీపై వెళ్లడానికి ముందురోజు సాయికాంత్‌వర్మ ఆదేశాలు జారీచేశారు. అలాగే బక్కన్నపాలెంలో పదిహేనేళ్ల కిందట నిర్మించిన రోడ్డులో స్థలం పోయిందంటూ ఒక వ్యక్తికి రూ.208 కోట్ల విలువైన టీడీఆర్‌ను జారీచేశారు. అదేవిధంగా హయగ్రీవ భూమిపై వివాదం నడుస్తున్నప్పటికీ పట్టించు కోకుండా నిర్మాణాలకు అనుమతులు జారీచేయడం వివాదాస్పదమైంది. వీటన్నింటిపై జీవీఎంసీ కమిషనర్‌గా వచ్చే అధికారి ... మిగతా 6వ పేజీలో

7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

- నోటిఫికేషన్ జారీచేసిన ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్
- 30 వరకూ నామినేషన్ల స్వీకరణ

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక వచ్చే నెల ఏడున నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ హరీంధిర ప్రసాద్ సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. స్టాండింగ్ కమిటీ పది మంది సభ్యులను 97 మంది కార్పొరేటర్లు ఎన్నుకోవలసి ఉంటుంది. సోమవారం నుంచి ఈనెల 30వ తేదీ వరకూ ఉదయం 11 నుంచి మూడు గంటలు వరకూ జీవీఎంసీ కార్యదర్శి కార్యాలయంలో నామినేషన్ల పత్రాలు అందుబాటులో ఉంచుతారు. పూర్తిచేసిన నామినేషన్ పత్రాలను ఈనెల 30లోగా అదనపు కమిషనర్ (జనరల్) కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆదేరోజు సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ల జాబితాను ప్రచురిస్తారు. 31న ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల పరిశీలన, ఆదేరోజు సాయంత్రం అనుమతించిన నామినేషన్ల ... మిగతా 6వ పేజీలో

మత్స్య శాఖ జేడీగా విజయ



విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): విశాఖ జిల్లా మత్స్య శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్‌గా విజయ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె కాకినాడ నుంచి ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి జేడీగా వ్యవహరించిన విజయకృష్ణ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఇక్కడే కొనసాగనున్నారు.

ఏలేరు రిజర్వాయర్ కళకళ

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నాలుగు మీటర్లు మేర పెరిగిన నీటిమట్టం

- రిజర్వాయర్ నుంచి మోటార్లతో పంపింగ్ నిలిపివేత
- గ్రావిటీ ద్వారా కాలువలోకి నీరు విడుదల
- రైవాడ రిజర్వాయర్‌లోనూ రెండు మీటర్లు పెరిగిన నీటిమట్టం



నీటితో కళకళలాడుతున్న ఏలేరు రిజర్వాయర్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నగరానికి తాగునీరు అందించే ప్రధాన రిజర్వాయర్లలోకి భారీగా నీరు చేరింది. రిజర్వాయర్లలో నీటి మట్టం గణనీయంగా పెరిగింది. రిజర్వాయర్ల పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కొనసాగుతుండడంతో మరో రెండు రోజుల్లో నీటి మట్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

నగరవాసుల తాగునీటి అవసరాలకు కావాల్సిన నీటిలో 90 శాతం మేర ఏలేరు రిజర్వాయర్ నుంచి, మరో ఐదు శాతం రైవాడ రిజర్వాయర్ నుంచి తీసుకుంటున్నారు. ఏలేరు రిజర్వాయర్ పరీవాహక ప్రాంతంలో గత ఏడాది సరిగా వర్షాలు పడకపోవడంతో ఈ ఏడాది మార్చి నాటికే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి చేరిపోయింది. కాలువలోకి నీరు గ్రావిటీ ద్వారా ప్రవహించకపోవడంతో మోటార్లతో నీటిని రిజర్వాయర్ నుంచి కాలువలోకి పంపింగ్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. జూన్ నెలాఖరు వరకూ వర్షాలు కురవకపోవడంతో నగరానికి తాగునీటికి ఇబ్బంది తప్పదనే ఆందోళన జీవీఎంసీ అధికారుల్లో వ్యక్తమైంది. ఇలాంటి తరుణంలో గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండడంతో ఏలేరు రిజర్వాయర్‌లోకి నీటి ప్రవాహం పెరిగింది. రిజర్వాయర్‌లో నీటి మట్టం నాలుగు మీటర్లు పెరిగి ప్రస్తుతం 75.6 అడుగులకు చేరింది. దీంతో రిజర్వాయర్‌లో పంపింగ్ నిలిపివేసి, గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. మరో రెండు రోజులపాటు రిజర్వాయర్‌లోకి నీరు చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. నగరానికి తాగునీరు అందించే మరో ప్రధానమైన ... మిగతా 6వ పేజీలో

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణపై దృష్టి

- సరిహద్దుల గుర్తింపునకు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కలెక్టర్ లేఖ



విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

ఎర్రమట్టి దిబ్బలకు ఆనుకుని భీమిలి మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీకి కేటాయించిన భూములు చదును చేయడంతో తలెత్తిన వివాదం పరిష్కారంపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. ఈ మేరకు భౌగోళిక వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బలను గుర్తించిన జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తాజాగా లేఖ రాశారు. మొత్తం 260 ఎకరాల్లో విస్తరించిన ఎర్రమట్టి దిబ్బలకు హద్దులు గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటుచేస్తే అటు రక్షణ కల్పించడంతోపాటు ఇటు వివాదాలకు తెరపడుతుందని నిర్ణయానికి వచ్చారు.

భీమిలి బీచ్‌రోడ్డులో సముద్ర మట్టానికి 10 మీటర్ల నుంచి 90 మీటర్ల ఎత్తు వరకు కలిగిఉన్న ఎర్రమట్టి దిబ్బలు వేల సంవత్సరాల క్రితం ఏర్పడినట్టు ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజనీరింగ్ నిపుణులు గుర్తించారు. తమిళనాడులో ఇటువంటి ఎర్రమట్టి దిబ్బలు ఉన్నాయి. వాటి కంటే భీమిలి సమీపాన గల ఎర్రమట్టి దిబ్బలు ఎంతో పురాతనమైనవే కాకుండా మానవ చరిత్రతో ముడిపడి ఉన్నట్టుగా ఏయూ నిపుణులు అప్పట్లో ... మిగతా 6వ పేజీలో

వర్షానికి రోడ్లు ఛిద్రం

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో పలుచోట్ల రహదారులు దెబ్బతిన్నాయి. వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలుచోట్ల రోడ్లపై వర్షం నీరు చేరింది. అందులో నుంచి వాహనాలు రాకపోకలు సాగించడంతో ఆ తాకిడికి బాగా నాని ఉన్న రోడ్లపై మొదట చిన్న గుంతలు ఏర్పడి...అవి క్రమంగా పెద్దవి అయ్యాయి. వాహన చోదకులు రోడ్లపై ఏర్పడిన గుంతలను గమనించపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. జగదాంబ జంక్షన్, డాల్ఫిన్ హోటల్, రామకృష్ణ థియేటర్, పూర్ణామార్కెట్, గురుద్వారా, మద్దిలపాలెం, ఇసుకతోట జంక్షన్ వంటి ప్రాంతాలతో పాటు జాతీయ రహదారిపై కూడా అక్కడక్కడా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం వల్ల కలిగిన నష్టాన్ని అంచనా వేసే పనిలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారు. రోడ్లకు జరిగిన నష్టంపై అంచనాలు పూర్తయిన తర్వాత గుంతలను పూడ్చేందుకు టెండర్లు పిలవాలని భావిస్తున్నారు.

నష్టం లెక్కింపులో జీవీఎంసీ అధికారులు

- అనంతరం మరమ్మతులకు టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయం



రామకృష్ణ థియేటర్ వద్ద దెబ్బతిన్న రోడ్డు



గురుద్వారా బస్టాప్ వద్ద జాతీయ రహదారిపై పడిన గొయ్యి



అక్కయ్యపాలెం వద్ద దెబ్బతిన్న జాతీయ రహదారి

వర్షాల వల్ల వాటిల్లిన నష్టంపై నివేదికలు

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల కలిగిన నష్టంపై వివరాలు తక్షణమే అందించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, జల వనరులు, జీవీఎంసీ, విద్యుత్ శాఖల అధికారులు తమ పరిధిలో నష్టాలపై నివేదికలు వెంటనే సమర్పిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా నాణ్యమైన విధంగా పరిష్కారం చూపాలన్నారు.

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ పర్యవేక్షకుడిగా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 22: నగరానికి చెందిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత (బాక్సింగ్) ఐ. వెంకటేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 26 నుంచి పారిస్‌లో జరిగే ఒలిం పిక్ గేమ్స్‌లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టు పర్యవేక్షకునిగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖతో పాటు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్‌ఐ) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరుగురు బాక్సింగ్ క్రీడాకారులను వెంకటేశ్వరరావు పర్యవేక్షించనున్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మక ఒలింపిక్స్‌లో అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేశ్వరావును ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రెల్లి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 22: జాతీయ రెల్లి ఎస్సీ గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా యర్రంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం జాతీయ అధ్యక్షులు భూపతి అప్పారావు సారథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రెల్లి సామాజిక వర్గాన్ని చైతన్య పరుస్తూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతీయ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న అక్టోబర్‌లో రెల్లిలా జాతీయ మహాసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.అప్పారావు, కె.వెంకటరావు, ఎం.సత్యనారాయణ, బి.కుమార్, చెన్నా శ్రీనివాసరావు, ఎ.వెంకట్రావు, పీర్రాజు, ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.

సంఘ సేవకురాలు సత్యవతి ఇకలేరు..


సత్యవతి (ఫైల్‌ఫోటో)

డాబాగార్డెన్స్, జూలై 22: నగరానికి చెందిన సంఘ సేవకురాలు కోసూరు సత్యవతి (97) ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాజహితాన్ని కోరిన ఆమె ఎంతో మంది నిరుపేదలను అక్కున చేర్చుకుని సేవలంచారు. తను పొందిన పింఛన్ , తన కుమారుడి సహకారంతో ఆమె జీవితాంతం ఆలయాలు, ఆశ్రమాలు, అనాథ శరణాయాలకు, స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందించారు. నిర్వాశ్రయులకు దుస్తులు అందజేశారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆమెకు మనమడు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం ఉషోదయ జంక్షన్ వద్ద శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

28 నుంచి ఆలిండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలు

డాబాగార్డెన్స్, జూలై 22: ఆలిండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలను ఈ నెల 29వ తేదీ నుంచి స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సంప్రదాయ నృత్య కళాకారులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో దేశభక్తి అంశంతోపాటు జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సీనియర్ బృంద విభాగాల్లో ఫైనల్స్ విజేతలకు ప్రథమ రూ. 50 వేలు, ద్వితీయ రూ. 25వేలు, తృతీయ బహుమతికి రూ. 15 వేల చొప్పున, అలాగే, ట్రోఫీలను అందజేయనున్నట్టు తెలిపారు. దేశభక్తి, జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేస్తామన్నారు. ఈ వేడుకలో గ్రాండ్ ఫైనల్స్ విజేతలకు వికసిత్ భారత్ నృత్యట్రోఫీ 2024తో పాటు ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఫోన్: 85229 90123ను సంప్రదించాలని కోరారు.

పోస్టర్ మేకింగ్ పోటీల్లో జాతీయ బహుమతులు


విద్యార్థికి అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార, జూలై 22: ఇన్‌టచ్ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) నిర్వహించిన పోస్టర్స్ మేకింగ్ పోటీల్లో విశాఖపట్నం శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.దుర్గప్రణిత హెరిటేజ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ సర్వీస్ ప్రోగ్రాం పెయింటింగ్ పోటీలో నా స్మారక శోధన అనే అంశాన్ని చిత్రించి జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.హెచ్.భవజ్ఞ ప్రాంతీయ స్థాయిలో విజేతగా నిలిచారు. న్యూ ఢిల్లీలో నిర్వాహకులు దుర్గ ప్రణితిని సత్కరించి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ విజేతలను అభినందించారు.

స్టీల్‌ప్లాంటు స్థలం స్వాధీనం


స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీ కాలనీలో స్టీల్‌ప్లాంటు భూమిని ఒకరు ఆక్రమించుకొని నిర్మాణం చేపట్టగా కోర్టు ఉత్తర్వులతో అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌బీ కాలనీలో 17వ నంబరు ప్లాట్‌ను ఒకరు చాలా కాలం క్రితం కొనుగోలు చేశారు. ఆ స్థలానికి తూర్పున 15 గజాలు, పడమరన 77 గజాల స్టీల్‌ప్లాంటు స్థలాన్ని ఆక్రమించారు. ఈ విషయమై స్టీల్ ప్లాంటు టౌన్ ప్లానింగ్ విభాగం పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ప్లాంటుకు అనుకూలంగా ఉత్తర్వులు రావడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంటు అధికారులతో ఆక్రమణదారులు గొడవకు దిగారు. ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణం కొంత పడగొట్టారు. నిబంధనల ప్రకారమే స్థలం స్వాధీనం చేసుకున్నామని ప్లాంటు వర్గాలు తెలిపాయి.

బైక్ వెనుక కూర్చున్న వారికీ హెల్మెట్ ఉండాలి

» ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పోలీసులు అధికారులు

మహరాణిపేట, జూలై 22: ద్విచక్ర వాహనదారుడితో సహా వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పకుండా ధరించాలని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో రోజూ చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఒకరిద్దరు మృతి చెందుతుండగా, పలువురు గాయాలపాలవుతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించటం ప్రాణాంతకమని హెచ్చరించారు. ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. ఈమేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నగరంలో సుమారు 44 ప్రధాన కూడళ్లలో ప్రచారం చేస్తామన్నారు. బీఐఎస్ మార్కు ఉన్న హెల్మెట్‌నే ధరించాలన్నారు. వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఏ ఒక్కరికి హెల్మెట్ లేకున్నా రూ. 1035 చలానా వసూలు చేస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, సంబంధిత వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు మూడు నెలలు పాటు సస్పెండ్ చేయనున్నట్టు చెప్పారు. మైనర్లకు వాహనం ఇస్తే.. తల్లిదండ్రులకు, లేదా ఆ వాహనదారులకు శిక్షకు గురవుతారన్నారు. బకాయి చలానాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

లద్దాఖ్‌కు బైక్ రైడ్‌చేసిన యువకుడికి సన్మానం


పర్వతారోహకుడు ఉస్మాన్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

వేపగుంట జూలై 22: ప్రపంచంలో అత్యంత ఎత్తయిన లద్దాఖ్ పర్వతశ్రేణిని బైక్‌పై అధిరోహించిన గోపాలపట్నం నాగేంద్ర కాలనీకి చెందిన ఉస్మాన్‌ను వేపగుంట మసీద్ ఈ క్యూబాలో స్థానిక యువకులు, నూతనంగా ఎన్నికైన బీసీ ముస్లిం సంఘ ప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఉస్మాన్ మాట్లాడుతూ తన డ్యూక్ బైక్‌పై నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, చైనా, మియన్మార్, నేపాల్ దేశాల మీదుగా మూడు నెలల వ్యవధి లో ఈ ప్రయాణం సాగిందన్నారు. అలాగే, ప్రపంచంలో సముద్రమట్టానికి 19, 024 అడుగుల ఎత్తయిన ఉమిలింగాల ప్రాంతానికి చేరుకొని తిరిగి బైక్‌పైన గత జూలై 12న తిరిగివచ్చినట్టు చెప్పారు. ఈ యాత్రకు స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారన్నారు. ముస్లిం పెద్దలు, ఇతన సంఘాల నాయకులు ఉస్మాన్‌ను అభినందనలు తెలిపారు.

'మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యం'

సీతంపేట, జూలై 22: మాతా శిశు మరణాల నియం త్రణ లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్ హెచ్‌వో పి.జగదీశ్వరరావు కోరారు. తన కార్యాలయంలో ఆయన జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఆశ వర్కర్ల నోడల అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమి సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మాతా శిశు మరణాల నియంత్రణ లక్ష్యంగా కేం ద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిల్కారి సేవలను అందులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియామాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ ద్వారా అందించేందుకు ప్రభుత్వ రూపకల్పన చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొ స్టేట్ ప్రోగాం మేనేజర్ రాజు లంకపల్లి పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డీఐవో బి.ఉమావతి, డీపీఎంవో కృష్ణకాంత్, ఆర్.మోహన్‌రావు, కె. ధర్మేంద్ర, ఐ. మనోరమ, శశిభూషణ్, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

'సెల్‌ఫోన్ సిమ్ విక్రయాల్లో సరైన పత్రాలు స్వీకరించాలి'

డాబాగార్డెన్స్, జూలై 22: సెల్‌ఫోన్ సిమ్స్ విక్రయించిన సమయంలో కొనుగోలుదారులకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలను స్వీకరించాలని బీఎస్ఎన్ఎల్ పీజీఎంటీడీ పాల్‌విలియమ్స్, పీజీఎం ఆడమ్.జి పేర్కొన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో టెలికం శాఖ ఆధ్వర్యంలో టెలికాం పాయింట్ ఆఫ్ సేల్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లుపై ఇతరత్రా ఫుట్‌పాత్‌లపై సిమ్స్‌ను విక్రయించే వివిధ రకాల సిమ్స్‌ను సరైన ధ్రువపత్రాలు లేకుండా విక్రయించడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు. తప్పుడు డాక్యుమెంట్స్‌తో సిమ్స్ తీసుకునే వారు తదుపరి సైబర్‌క్రైమ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల జాగ్రత్తగా విక్రయించాలని సూచించారు.

వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సిరిపురం, జూలై 22: సిరిపురంలోని వుడా భవన్‌లో వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ప్రసాద్, జనరల్ సెక్రటరీగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా రవిశంకర్, రవికుమార్, అడిషినల్ సెక్రటరీగా రాజేష్, కోశాధికారిగా రమణారావు, ఉప కోశాధికారిగా రాము, సంయుక్త కార్యదర్శులుగా సాగర్, కిశోర్, నాగ గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నవీన్, సూర్యనారాయణరాజు, బాస్కర్ ఎన్నికయ్యారు.

భీమ్‌నగర్‌లో కొళాయి ప్రారంభం

అల్లిపురం, జూలై 22: జీవీఎంసీ 32వార్డు పరిధిలోని భీమ్‌నగర్ స్థానిక దుర్గా దేవి ఆలయంలో సోమవారం వార్డు కార్పొరేటర్, దక్షిణ నియోజకవర్గ నాయకుడు కందుల నాగరాజు తాగునీటి కొళాయిని ఆయన ప్రారంభించారు. భక్తుల అవసరాల కోసం ఈ కొళాయి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు ఈశ్వరరావు, ఆదినారాయణ, కందుల బద్రినాథ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు శిక్షణ


శిక్షణ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి గిరిధర్

మహారాణిపేట, జూలై 22: కొన్ని కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంపై వివిధ జిల్లాల న్యాయమూ ర్తులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో విశాఖ పట్నం, విజయనగరం శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ నెల 26 వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. విశాఖ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ప్రిన్సిపాల్ ఆలపాటి గిరిధర్, శ్రీకా కుళం జిల్లా జడ్జి జూనైద్ అహ్మద్, విజయనగరం జిల్లా జడ్జి బీ సాయి కళ్యాణ్ చక్రవర్తి, న్యా యమూర్తులు యు.యు. ప్రసాద్, సీహెచ్ సురేందర్ సింగ్, ఎంవీ తక్‌చన్. ఎం. వెంకట శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ దిక్సూచిగా సాహిత్యం

» ప్రముఖ వైద్య నిపుణుడు కూటికుప్పల సూర్యారావు


సాహితీవేత్తను సన్మానం చేస్తున్న మక్కెన ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట, జూలై 22: సమాజాన్ని సన్మార్గంలో పయనించేలా చేయగల శక్తి సాహిత్యానికి ఉందని ప్రముఖ వైద్య నిపుణుడు కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో దశమ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ కవులు, రచయితలకు డాక్టర్ మక్కెన శ్రీను సాహితీ పురస్కారాలను అందిస్తూ వారిని గౌరవిరచడం అభినందనీయమని అన్నారు. వి. రాజారామ్మోహన్‌రావు మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చేయూనందించాలన్నారు. డాక్టర్ మక్కెన శ్రీను గత పదేళ్లుగా తమ సంస్థ ద్వారా చేపట్టిన సాహిత్య కృషిని వివరించారు. అనంతరం పురస్కార గ్రహీతలైన డాక్టర్ ఎం.సుగణరావు, లేదాళ్ళ రాజేశ్వరరావు, బండారు రాజ్‌కుమార్, కొమ్మల వెంకట సూర్యనారాయణ, ముని సురేష్ పిళ్ళైలను ఘనంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


గణేశ్వరరావు (ఫైల్)

గోపాలపట్నం, జూలై 22: మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రేటర్ పరిధి చంద్రనగర్‌లో కడలి గణేశ్వరరావు (31) కుటుంబ సభ్యులతోపాటు నివశిస్తున్నాడు. సోదరుడు సాంబశివరావుతో కలిసి తాటిచెట్లపాలెం వద్ద కార్పెంటర్ షాపు నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల గణేశ్వరరావుకు పలు పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరక పోవడంతో రెండు నెలలుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గణేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం తాను ఉంటున్న ఇంటిపైన నిర్మాణంలో ఉన్న ఓ గదిలోనికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు సీఐ సురేశ్ కుమార్, ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో మరొకరు..

భీమునిపట్నం: పట్టణంలోని బోయవీధికి చెందిన మత్స్యకార యువకుడు మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొక్కిరి ఎల్లాజీ (24)కి, అదే వీధికి చెందిన లావణ్యతో గత ఏడాది వివాహమైంది. వారికి ఏడు నెలల పాప వుంది. లావణ్య ప్రస్తుతం కన్నవారింట్లో ఉంటోంది. సోమవారం ఉదయం భార్య, పాపను చూసిన అనంతరం ఎల్లాజీ తన ఇంటికి చేరుకున్నాడు. మధ్యాహ్నం ఆయన సోదరుడు ఫోన్ చేసి గ్రామదేవత పండగ సమావేశానికి రావాలని కోరాడు. అప్పటికే అతను మద్యం సేవించి ఉండడంతో సమావేశానికి వెళ్లలేదు. సాయంత్రం సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పైడిరాజు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డుదారులకు రాగులు

» మసూరి కందిపప్పు పంపిణీకి అధికారుల ప్రతిపాదన

విశాఖపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి ఉచితంగా రాగులు అందజేయనున్నారు. కార్డుదారుల అభీష్టం మేరకు కిలో నుంచి గరిష్ఠంగా మూడు కిలోల వరకు పంపిణీచేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. అయితే ఆ మేరకు బియ్యం సరఫరాలో కోత విధిస్తారు. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇప్పటికే 50 టన్నుల రాగులు చేరాయి. గతంలో కార్డుదారులకు రాగి పిండి అందజేశారు. ఎక్కువమంది తీసుకోకపోవడంతో పిండి పాడైంది. డీలర్లు నష్టపోవడంతో ప్యాకెట్లు వెనక్కి తీసుకున్నారు. అయితే పిండికి బదులు రాగులు పంపిణీచేయాలని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. కాగా కందిపప్పు పంపిణీకి టెండర్లు ఖరారు కాకపోవడంతో ప్రత్యామ్నాయంగా వచ్చేనెల నుంచి మసూరి కందిపప్పు (ఎరుపురంగులో ఉంటుంది) అందజేయాలని యోచిస్తున్నారు. జిల్లాలో 5.29 లక్షల కార్డుదారులకు నెలకు కిలో చొప్పున పంపిణీ చేసేందుకు 529 టన్నుల పప్పు అవసరం. మసూరి కందిపప్పు తీసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తున్న అధికారులు, ప్రస్తుతం 50 టన్నుల సరకు తేవాలని యోచిస్తున్నారు.

వచ్చే నెల ఒకటోతేదీ నుంచి కార్డుదారులకు పంచదార పంపిణీ చేయలేమని అధికారులు చెబుతున్నారు. పంచదార టెండర్లు ఖరారు కాకపోవడంతో స్టాకు రాలేదన్నారు. ఇదిలావుండగా వచ్చేనెల ఒకటోతేదీ నుంచి పంపిణీ కోసం సోమవారం నుంచి డిపోలకు బియ్యం పంపిణీ ప్రారంభమయింది. జిల్లాలో 640 డిపోల పరిధిలో 5.29 లక్షల కార్డుదారులకు ఎనిమిదివేల టన్నుల బియ్యం అవసరమని జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు.

శిక్షా సప్తాహ్ వేడుకలు


టీఎల్ఎంలను పరిశీలిస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

కంచరపాలెం, జూలై 22 : నగరంలో అన్నీ రకాల పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. నూతన జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలల్లో సృజనాత్మక బోధనను అందించడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం అన్నీ పాఠశాలల్లో విద్యార్థులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి ప్రదర్శన మేళాను నిర్వహించారు. స్థానిక జ్యోతినగర్, కంచరపాలెం, ఆర్పీపేట, తిక్కవానిపాలెం, ధర్మానగర్ పాఠశాలల్లోని ఈ వేడుకలను ఎంఈవో అంబటి సోమేశ్వర్రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం, 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అక్కయ్యపాలెం: జాతీయ నూతన విద్యా విధానం నాల్గో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేశారు. అలాగే వాటిని విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.పద్మజ రాణి మాట్లాడుతూ లో పనికిరాని వాటిని సేకరించి తరగతికి అనుగుణమైన టీఎల్ఎంను విద్యార్థులతో తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

ఇన్‌స్పైర్ -మనక్ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, జూలై 22: ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్)- మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్ (మనక్) పోస్టర్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ పాల్గొన్నారు.

సవాళ్లు అనేకం

... 5వ పేజీ తరువాయి

తదుపరి ఉత్తర ప్రత్యుత్తరాలు కోర్టుతో జరపాల్సి ఉంటుంది. అదే సమయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. కౌన్సిల్‌లో ఇంతవరకూ వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఎన్నికతోపాటు కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా జరిగిపోయేవి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో రాజకీయ పార్టీల బలాబలాలు మారిపోతున్నాయి. వైసీపీ కార్పొరేటర్లు 12 మంది ఆ పార్టీని వీడి టీడీపీ, జనసేనలో చే రారు. మరికొందరు కూడా అదేబాటలో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలను కూటమి దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో మేయర్ వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కౌన్సిల్ సమావేశం కూడా రసాభాసగా జరిగే అవకాశం ఉంది. వీటన్నింటినీ అధిగమిస్తూనే నగర అభివృద్ధిపై కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంటుంది. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సంపత్‌కుమార్ నగరంలో పరిస్థితులను అవగాహన చేసుకుంటూనే కౌన్సిల్‌లో రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని నగరాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, వాటి అమలు, జీవీఎంసీ ఆదాయం పెంచడానికి కృషిచేయాల్సి ఉంటుంది.

7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

ప్రచురణ జరుగుతుంది. మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తారు. ఏడో తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాలులో పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

... 5వ పేజీ తరువాయి

ఎకానమీ కోచ్‌లలో మాదిరిగానే కంపార్టుమెంట్‌కు ఆరు బెర్తులు అందుబాటులో ఉంటాయి.

అత్యధిక అక్యుపెన్సీ రైళ్లలో ఒకటి

భారతీయ రైల్వేలో అత్యధిక ఆక్యుపెన్సీ ఉన్న రైళ్లలో ఒకటిగా గరీబ్‌రథ్ (12739/12740) గుర్తింపు పొందింది. 2008 అక్టోబరు 25న విశాఖలో పట్టాలెక్కిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఇప్పటికీ ఏడాది పొడవునా మంచి ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తోంది.

ఏలేరు రిజర్వాయర్ కళకళ

... 5వ పేజీ తరువాయి

రైవాడ రిజర్వాయర్‌లో కూడా నీటిమట్టం పెరిగింది. గత నాలుగు రోజుల్లో రెండు మీటర్లు పెరిగింది. నాలుగు రోజులు కిందట 105.5 మీటర్లు ఉన్న నీటి మట్టం ప్రస్తుతం 107.5 మీటర్లకుపెరిగింది. దీనివల్ల నగరానికి తాగునీటి ఇబ్బం దులు మరో ఆరు నెలలు వరకూ తొలగినట్టేనని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

ధ్రువీకరించారు. ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరిన నేపథ్యంలో 2014లో 'వారసత్వ సంపద'గా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. భీమిలికి నైరుతిగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు తూర్పు పడమరగా 20 మీటర్ల నుంచి రెండు కిలోమీటర్లు, ఉత్తర, దక్షిణగా ఒక కిలోమీటరు వెడల్పుగా విస్తరించాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2014లో ప్రకటించిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఎర్రమట్టి దిబ్బలకు ఆనుకుని కొంత ప్రాంతం స్థానికులు ఆక్రమించుకుని జీడితోటలు పెంచుకుంటున్నారు. ఇంకా మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు జరిపింది. ముఖ్యంగా గడచిన ఐదేళ్లలో ఎర్రమట్టి దిబ్బలకు జరిగిన నష్టం చాలా ఎక్కువని స్థానికులు చెబుతున్నారు. ఇక భీమిలి సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన 373.95 ఎకరాల్లో 91.5 ఎకరాలు ఎర్రమట్టి దిబ్బల్లో ఉండడం ప్రస్తుత వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలో ఎర్రమట్టి దిబ్బలుగా గుర్తించిన ప్రాంతానికి సరిహద్దులు గుర్తించి రక్షణ కల్పించాలని కలెక్టర్ నిర్ణయించారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి.

ఠాగూర్ సినిమాను మరిపించేలా...

కొన్నాళ్ల కిందట వచ్చిన ఠాగూర్ సినిమాలో చనిపోయిన వ్యక్తికి ఓ కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు చికిత్స చేస్తారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు సీన్ క్రియేట్ చేసి...చివరకు ఎంత ప్రయత్నించినా ప్రాణం కాపాడలేకపోయామంటూ సమాధానమిస్తారు. అయితే అక్కడ హీరో బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాడు. నగర పరిధిలోని అనేక కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ తరహా సీన్లు నిత్యం దర్శనమిస్తుంటాయని బాధితులు చెబుతున్నారు.

అది బిల్లింగ్ హాస్పిటల్...

జిల్లా పరిషత్ సమీపంలోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో రోజుల వయసున్న చిన్నారి చికిత్సకు సుమారు మూడున్నర లక్షల బిల్లు వసూలు చేసిన యాజమాన్యం..ఆ తరువాత పరిస్థితి సీరియస్‌గా ఉందంటూ మరో ఆస్పత్రికి తరలించి చేతులు దులుపుకుంది. ఆ ఆస్పత్రికి వెళ్లిన వారెవరైనా రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సిందే. ఈ క్రమంలో దీనికి 'బిల్లింగ్ హాస్పిటల్' అన్న పేరు కూడా రావడం గమనార్హం. ఈ ఆస్పత్రి గురించి తెలియక ఎంతోమంది అక్కడికే వెళుతుంటారు. అలా వెళ్లిన వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసి..అనేక సందర్భాల్లో చివరికి సారీ అంటూ రోగి బంధువులకు చెప్పిన దాఖలాలున్నాయని చెబుతుంటారు. ఈ ఆస్పత్రిలో జరుగుతున్న అన్ని వ్యవహారాలు ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసినా..ఎవరూ ఫిర్యాదు చేయడం లేదంటూ చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

రోగి పరిస్థితి చెప్పరు..

ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకసారి రోగిని చేర్పితే..ఆ తరువాత ఎప్పుడు బయటకు వస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఎన్నిసార్లు అడిగినా రోగి కండిషన్ చెప్పరు. సీరియస్‌గా ఉందని, మెల్లగా కుదుటపడుతోందని, కనీసం నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే ఉంచాలని సిబ్బంది చెబుతుంటారు. నగదు చెల్లించే కేసుల్లో అయితే ఈ తరహా మాటలు విరివిగా వినిపిస్తుంటాయి. వీలైనంత దోచేసిన తరువాత మాత్రమే రోగిని మెల్లగా డిశ్చార్జ్ చేస్తారు. అదీ బాగుంటేనే. లేదంటే ఎమర్జెన్సీ సీన్ క్రియేట్ చేసి ఇతర ఆస్పత్రులకు తరలించి..తమకు ఇబ్బందుల్లేకుండా చేతులు దులిపేసుకుంటారు. అంతేకాదు ఆస్పత్రిలో ఉన్న రోగి వద్దకు బంధువులు, సహాయకులను అనుమతించారు. రోజులో ఒకటి, రెండుసార్లు మాత్రమే చూసి వెళ్లేందుకు పంపిస్తారు. అదేమని ప్రశ్నిస్తే ఇన్‌ఫెక్షన్లు వస్తాయని భయపెడుతుంటారు. పొరపాటున ఐసీయూ, వెంటిలేటర్‌లో ఉంచాల్సి వస్తే...రోజుకు ఇంత అని చొప్పున వసూలు చేయడంతోపాటు బెడ్, ఆక్సిజన్, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు, మందులు ఇలా... ప్రతి దానికీ అదనంగా బిల్లులు వేసి ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న ఉద్దేశంతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. ఈ ఆస్పత్రుల దందాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఆరోగ్య శాఖ అధికారులు చోద్యంచూస్తున్నారు.

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం: జడ్సీ కృష్ణ

జ్ఞానాపురం, జూలై 22: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అధికారులకు అన్నారు. సోమవారం స్థానిక జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి 4, యూసీడీకి ఒకటి వచ్చినట్టు ఆయన తెలిపారు. సూపరింటెండెంట్ టి.ఎస్.ఎన్.రాజు,ఇంజనీరింగ్ ఈఈలు మృత్యుంజరాజు, ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్ పాల్గొన్నారు.



వర్షాలకు ఛిద్రంగా మారిన గాజువాక జగ్గు జంక్షన్ రోడ్డు



గోతులతో నిండిన దువ్వాడ-కాపుజగ్గరాజుపేట రహదారి



దువ్వాడ రైల్వే స్టేషన్ రోడ్డులో పెద్ద గొయ్యి

దారులు.. దారుణం

వర్షాలతో మరింత ఛిద్రంగా మారిన వైనం

ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు

శ్రీహరిపురంలో వీధుల్లోకి చేరిన మురుగు నీరు

గాజువాక, జూలై 22: అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అసలే అంతంత మాత్రంగా ఉన్న పలు ప్రాంతాల్లోని రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉన్నాయి. వర్షాల మూలంగా రహదారుల్లోని గోతుల్లో వర్షపు నీరు తిష్ట వేయడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించడం మరింత ఇబ్బందికరంగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కడా కూడా రహదారులకు మరమ్మతులు చేయలేదు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఆయా రోడ్లు మరింత గోతుల మయంగా మారాయి. ముఖ్యంగా జగ్గు జంక్షన్, కణితి రోడ్డు మొత్తం గోతులతో నిండిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానాపాట్లు పడుతున్నారు. గోతుల్లో నీరు చేరిపోవడంతో ఎక్కడ గుంతలు ఉన్నాయో.. ఎక్కడో లేవో తెలియక పలురు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోతులమయమైన రోడ్ల గురించి పట్టించుకునే పాలకులు, అధికారులే కరువయ్యారని వాపోతున్నారు. రాష్ట్రంలో నూతనంగా కొలువుదీరిన కూటమి ప్రభుత్వమైనా రహదారుల మరమ్మతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని పలువురు వేడుకుంటున్నారు.



గోతులమయమైన కణితి రోడ్డు



బురదమయంగా పెందుర్తి బాలాజీనగర్ రోడ్డు

దువ్వాడ రైల్వే స్టేషన్-కాపుజగ్గరాజుపేట రోడ్డులో అడుక్కో గొయ్యి..

కూర్మన్నపాలెం: గ్రేటర్ 86వ వార్డు పరిధి దువ్వాడ రైల్వే స్టేషన్-కాపు జగ్గరాజుపేట రహదారిలో అడుక్కో గొయ్యి దర్శనమిస్తోంది. వర్షాలకు ఆయా గోతుల్లో వర్షపు నీరు చేరడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించడం నరకప్రాయంగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గోతుల్లో ప్రయాణించడం వల్ల తరచూ తమ ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురువుతున్నాయని చెబుతున్నారు. ఈ మార్గం గుండా నిత్యం రాకపోకలు సాగించే ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులు, ఉద్యోగులు, కాపుజగ్గరాజుపేట, సత్తివానిపాలెం, నరవ, గవరజగ్గయ్య పాలెం, షీలానగర్‌కు చెందిన వాహనదారులు, కార్మికులు గోతుల మూలంగా ఇబ్బందులు పడుతున్నారు. వీఎస్ఈజెడ్‌కు వెళ్లి వచ్చే పలు కర్మాగారాల కార్మికుల అవస్థలు వర్ణనాతీతం. సంబంధిత అధికారులు స్పందించి ఈ రహదారి అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పెందుర్తిలో అస్తవ్యస్తంగా రహదారులు

పెందుర్తి: తెరిపివ్వని వర్షాలతో పెందుర్తిలోని రహదారులు అస్తవ్యస్తంగా మారాయి. రైల్వే స్టేషన్ రోడ్డు బురదతో అడుగు తీసి అడుగువేయలేని పరిస్థితిలో ఉంది. గుంతల్లో నీరు నిలిచి మరింత ప్రమాదకరంగా మారింది. అలాగే పెందుర్తి బాలాజీనగర్ రోడ్డు చిత్తడిగా మారడంతో సర్కస్ ఫీట్లు తప్పడం లేదని వాహనచోదకులు, స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వీధుల్లోకి వచ్చిన మురుగు నీరు

మల్కాపురం: వర్షాలతో పారిశ్రామిక ప్రాంతంలోని రహదారులపై పెద్దఎత్తున నీరు నిలవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అలాగే శ్రీహరిపురం, రామ్‌నగర్, గుల్లలపాలెం ప్రాంతాల్లోని కాలువలు, గెడ్డలు పొంగి మురుగు నీరంతా వీధిలోకి రావడంతో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రధానంగా హెచ్‌పీసీఎల్ గెడ్డ నీరు ముందు సాగక డ్రైనేజీల నుంచి మురుగు నీరు సమీపంలోని వీధుల్లోకి వచ్చేస్తోంది. హెచ్‌పీసీఎల్ మెయిన్ గేటు ఎదుట కూడా వర్షపు నీరు నిలిచిపోయింది. ఇక్కడ రోడ్డు కంటే కాలువ ఎత్తులో ఉండడంతో వాన నీరు కాలువలోకి వెళ్లడం లేదు. మల్కాపురం కృష్ణా బార్ ఎదుట, కోస్టుగార్డు సమీపంలో, కల్యాణి ఆస్పత్రి వద్ద, మల్కాపురం పోలీసు స్టేషన్ సమీపంలో రహదారులపై నీరు నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాగా శ్రీహరిపురంలోని పలుచోట్ల టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి పొత్తబత్తుల శ్రీను చొరవ తీసుకుని పారిశుధ్య సిబ్బందితో చెత్త తొలగించి కాలువల నుంచి నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.



శ్రీహరిపురం రామ్‌నగర్‌లోకి వచ్చిన మురుగు నీరు



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న కేఎస్ఎన్ రావు

స్టీల్‌ప్లాంటును ఆదుకుంటామని పార్లమెంటు సమావేశాల్లో ప్రకటించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు కేఎస్ఎన్ రావు

కూర్మన్నపాలెం, జూలై 23: ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాల్లో ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి స్టీల్‌ప్లాంటును ఆదుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు కేఎస్ఎన్ రావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,257వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక ప్యాకేజీతో పూర్తి సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. కూటమి నాయకులు స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నడుం బిగించాలని కోరారు. కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనమయ్యేటా చూడాలన్నారు. ఉక్కు కార్మికులకు సకాలంలో జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు ఎన్ని వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటేనే కార్మిక విజయాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు, యు.రామస్వామి, కె.శ్రీనివాసనాయుడు, మసేనురావు, నరేశ్‌కుమార్, నరసింగరావు, కె.రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి నిధి ఏర్పాటు

గోపాలపట్నం జెడ్పీ హై స్కూల్ పూర్వ విద్యార్థుల తీర్మానం



గోపాలపట్నం హై స్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

గోపాలపట్నం, జూలై 22: స్థానిక జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల కమిటీ సమావేశం పాఠశాల ప్రాంగణంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా 1963-2023 వరకు గల పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. పాఠశాల అభివృద్ధికి అంతా కలిసి నిధిని సమకూర్చి తద్వారా స్కూల్ కోసం వినియోగించడంతో పాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల అభ్యున్నతికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికను రూపొందించారు. పాఠశాలలో జరిగే అభివృద్ధిలో పూర్వ విద్యార్థుల భాగస్వామ్యం ఉండేలా కృషి చేస్తామని పూర్వ విద్యార్థుల కమిటీ సభ్యులు తెలిపారు. పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి వైఎస్ ప్రసాద్‌బాబు, కోశాధికారి ఎస్.శ్రీనాథ్‌తో పాటు ప్రతినిధులు కోనేటి సత్యనారాయణ, ఖలీల్ రెహమాన్, గోల్కొండ శ్రీనివాస్, ఎం.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుటౌన్‌షిప్‌లో కొండచిలువ పట్టివేత

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్-6లోని 106 క్వార్టర్స్‌లో భారీ కొండచిలువ స్థానికులను భయభ్రాంతులకు గురి చేసింది. 106-ఏలో నివాసముంటున్న స్టీల్‌ప్లాంట్ డీజీఎం మిశ్రా క్వార్టర్స్ ఆవరణలో కనిపించిన కొండచిలువను చూసి కాస్త భయాందోళనకు గురై వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారం అందించారు. ఈ మేరకు కిరణ్ వచ్చి ఎంతో చాకచక్యంగా కొండచిలువను పట్టుకోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పాములు ఎక్కడైనా కనిపిస్తే తనకు సమాచారం ఇవ్వాలని కిరణ్ కోరారు.



కొండచిలువతో స్నేక్ క్యాచ్ కిరణ్

ఘనంగా శ్రీకన్నెలమ్మ ఉత్సవం

పెదగంట్యాడ, జూలై 22: నెల్లిముక్కులో సోమవారం శ్రీకన్నెలమ్మ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆషాఢంలో వర్షాలు కురవాలని, చెరువులు, పంట కాలువలు నీటితో నిండాలని, పాడిపంటలతో ప్రజలంతా ఆనందంగా ఉండాలని కోరుతూ ప్రతి సంవత్సరం 14 గ్రామాల ప్రజలు ఈ ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా సోమవారం ఈ ఉత్సవాన్ని వైభవగా నిర్వహించారు. 14 గ్రామాల పెద్దలు, దొడ్డిపెద్దలు, కులపెద్దలు ఉత్సవంలో పాల్గొని అమ్మవారికి పసుపు కుంకులతో పూజలు జరపడంతో పాటు క్షీరాభిషేకం చేశారు. స్టీల్‌ప్లాంటును కష్టాల నుంచి గట్టెక్కించాలని, నిర్వాసితులందరికీ ఉపాధి కల్పించాలని అమ్మవారిని ప్రార్థించారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి, జూలై 22: వైసీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయిలో కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలోని రాంపురంలో ఉన్న పార్టీ కార్యాలయంలో సోమవారం క్రియాశీల కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి ఆదినుంచి అండగా నిలిచిన కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉంటానన్నారు. ప్రజల పక్షాన నిలిచి పోరాటాలు చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మధుపాడ నాగమణి, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పిలి దేవికనకరాజు, వైసీపీ మండల అధ్యక్షుడు గొరపల్లి శ్రీను, నాయకులు బొడ్డ ప్రకాశ్, సీహెచ్ దేవుడు, గోవింద్, బాలచంద్ర, తదితరులు పాల్గొన్నారు

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలిస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 58, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 18, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 42, క్యాబేజీ 32, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 145, బరబటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోసకాయ 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, క్యాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 62, దేముడు చిక్కుడు 82, కొండ ఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

సరిపల్లిలో రసాభాసగా గ్రామ సభ

ఉపాధి వేతనాల్లో అవకతవకలపై ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



ఇరువర్గాల వారిని సముదాయిస్తున్న పోలీసు

పెందుర్తి, జూలై 22: మండలంలోని సరిపల్లిలో ఉపాధి హామీ పథకం పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ గ్రామ సభ రసాభాసగా మారింది. కూలీల వేతనాల చెల్లింపులో వసూళ్లకు పాల్పడినట్టు ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఆరోపణలపై ఇరువర్గాల మధ్య ఘర్షణ నెలకొంది. చివరికి పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. వివరాలిలా ఉన్నాయి. సరిపల్లిలో ఉపాధి పథకం పనులపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. స్థానిక సర్పంచ్ గొర్లె రామకృష్ణ జగన్నాథం అధ్యక్షతన ఇన్‌చార్జి ఏపీవో రమేశ్‌నాయుడు పర్యవేక్షణలో ఉపాధి కూలీల నుంచి సేకరించిన వివరాలతో సోషల్ ఆడిటింగ్ ఎస్ఆర్పీ, డీఆర్పీ బృందం నివేదికను వివరించారు. ఈ క్రమంలో ఉపాధి క్షేత్ర సహాయకుడు గంజి రాము గ్రామంలోని 160 మంది ఉపాధి కూలీల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.100 చొప్పున రూ.16 వేలు అక్రమంగా వసూలు చేసినట్టు కొంత మంది ఆరోపించారు. తాను అక్రమ వసూళ్లకు పాల్పడలేదని, పని కొలతలు తీసేందుకు వారి గ్రూప్ లీడర్లే ఆ సొమ్ము వసూలు చేసి ఉండవచ్చని ఆయన వివరణ ఇచ్చారు. దీనిపై పలువురు ఉపాధి కూలీలు అభ్యంతరం వ్యక్తం చేశారు. కూలీల మస్తర్ల నమోదు, హాజరులోనూ అవకతవకలు జరిగాయని, వేతనాలు పక్కదారి పట్టినట్టు సభలో ఆరోపణలు చేయడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా ఒక వర్గం, ఆయనను వ్యతిరేకించేవారు మరో వర్గంగా ఏర్పడడంతో నెలకొన్న వాగ్వాదం కాస్త తోపులాటకు దారితీసింది. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కొంతమంది డిమాండ్ చేయడంతో గ్రామసభ రసాభాసగా మారింది. దీంతో అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు వచ్చి ఇరువర్గాలను సముదాయించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన అభియోగాలను మండల స్థాయిలో నిర్వహించనున్న ప్రజా వేదికలో ఆధారాలతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఏపీవో రమేశ్‌నాయుడు ఈ సందర్భంగా తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 24 వినతులు స్వీకరణ

గాజువాక, జూలై 22: జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి 24 వినతులను జెడ్సీ సన్యాసినాయుడు, తదితరులు స్వీకరించారు. వీటిలో పారిశుధ్య సమస్యలను, దోమలను నివారణకు చర్యలు చేపట్టాలని ఎనిమిది వినతులు, రోడ్లు, డ్రైనేజీలు వేయాలని ఆరు, టౌన్ ప్లానింగ్‌కు సంబంధించి ఐదు, వీధి లైట్లు వేయడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వినతులు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని జెడ్సీ సంబంధిత శాఖల అధికారులకు సూచించారు.



గాజువాకలో వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ సన్యాసినాయుడు

వేపగుంట జోనల్ కార్యాలయంలో..

వేపగుంట: వేపగుంట జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం ఐదు వినతులు అందాయి. వెంకటాపురంలో చెట్లు తొలగింపు చేపట్టాలని, పులగానిపాలెంలో ప్రభుత్వ స్థలం ఆక్రమణపై, దగ్గువానిపాలెంలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. 98వ వార్డులో శివారు కాలనీల్లో వీధి దీపాలు మరమ్మతులు చేపట్టాలని ఫిర్యాదులు అందాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపించి చర్యలు చేపట్టడం కె.హేమవతి పేర్కొన్నారు.

గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో..

ఎన్.ఎ.డి జంక్షన్: గోపాలపట్నం తహసీల్దార్ నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక ఫిర్యాదు అందింది. గోపాలపట్నం శివారు యల్లపువానిపాలెంలో ఇంటి స్థలం విషయంలో నెలకొన్న వివాదంపై వినతి అందించారు. సంబంధిత అధికారులకు పంపించి పరిష్కార చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ విజయభాస్కర్ పేర్కొన్నారు.



ఉక్కు బీఎఫ్ విభాగాధిపతిని కలిసిన నూతన కమిటీ సభ్యులు

ఇంటక్ బీఎఫ్ విభాగం నూతన కమిటీ నియామకం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 22: స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగానికి సంబంధించి ఇంటక్ నూతన కమిటీ నియామకం సోమవారం జరిగింది. విభాగం నూతన అధ్యక్షునిగా పోలీస్ నాయుడు, కన్వీనర్‌గా పాల అప్పలరెడ్డి, కార్యదర్శిగా నల్ల రవికుమార్, కోశాధికారిగా డీవీ. రమణలను యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నియమించారు. వీరితో పాటు 72 మంది సభ్యులుగా నియమితులయ్యారు. ఈ మేరకు నూతన కమిటీ సభ్యులు విభాగాధిపతిని కలిశారు. విభాగం మరింత ప్రగతి కోసం తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కారు రమణ, బీఎస్ రాజు, ఎస్పీ నాయుడు, పోతారెడ్డి, మొల్లి అప్పారావు, వీవీ నగేశ్, సత్యారావు, గోవిందరాజు , తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ పాఠశాలలో 'శిక్షా సప్తాహ్'

మల్కాపురం, జూలై 22: జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ) నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు కూరగాయలు, రంగుల అట్టలు వంటి వాటితో తయారుచేసిన టీఎల్ఎంలను ప్రదర్శించారు. తల్లిదండ్రులు, టీచర్ల సహకారంతో 1, 2వ తరగతి పిల్లలు పెయింటింగ్స్‌ను ప్రదర్శించారు. ఎంఈవో-2 వెంకటరావు, హెచ్ఎం హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీకి కూటమి నాయకుల అభినందనలు

అగనంపూడి, జూలై 22: విశాఖ సిటీ స్పెషల్ బ్రాంచి ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కింజరాపు ప్రభాకర్‌ను స్థానిక కూటమి నాయకులు సోమవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మాదకద్రవ్యాల రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఏసీపీని కలిసిన వారిలో కూటమి నాయకులు మోటూరి వెంకటరమణ, బి.సత్యనారాయణ, వెంకటరమణ, కె.జోగినాయుడు, తదితరులు ఉన్నారు.

వెంకటాద్రిపై చాతుర్మాస్య దీక్ష ప్రారంభం

పెందుర్తి, జూలై 22: ఇక్కడి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం చాతుర్మాస్య దీక్షకు శ్రీకారం చుట్టారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీనివాస, పద్మాదేవి, మంగాదేవి ఉత్సవమూర్తుల వద్ద శాస్త్రోక్తంగా ఈ దీక్షను ప్రారంభించారు. దీక్షా కాలం 27 రోజులు శ్రీరామాయణ హవనం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఆగస్టు 18 నుంచి 13 రోజుల పాటు వెంకటాద్రిపై స్వామివారికి నిత్య కల్యాణం జరుపుతారు. 31న పూర్ణాహుతి, అన్న సమారాధనలతో చాతుర్మాస్య దీక్ష ముగుస్తుంది.



వేదికపై ఉభయదేవేరులతో శ్రీవారు

నూతన కార్యవర్గం

వేపగుంట, జూలై 22: చీమలాపల్లి రోడ్డులోని మసీద్ ఈ క్యూబా మసీదులో సోమవారం ఉమ్మడి విశాఖ జిల్లా నూర్‌బాషా దేదేకుల బీసీ ముస్లిం సంక్షేమ సంఘం నూతన కమిటీ కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షునిగా సరిపల్లి ఖాన్‌సాహేబ్, అధ్యక్షునిగా షేక్‌బాబ్జీ, కార్యదర్శిగా గాజువాక చెందిన రెహమాన్, కోశాధికారిగా ఆదర్ సాహెబ్ తదితర సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు షేక్ బాబ్జీ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా పరిధిలో గ్రామ, మండల, జిల్లా కార్యవర్గాలను ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖా మంత్రిని ఆహ్వానించి పెందుర్తిలో ఆగస్టు నెలలో సమావేశాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వేంకటేశ్వరస్వామికి వైభవంగా శ్రవణా నక్షత్రం పూజలు

వేపగుంట/పెదగంట్యాడ, జూలై 22: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఘనంగా శ్రవణా నక్షత్రం పూజలను వైభవంగా నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. మధ్యాహ్నం గోపాలపట్నానికి చెందిన సన్యాసిరావు, అనిత, మోహన్‌రెడ్డి, నందిని దంపతుల ఆర్థిక సాయంతో అన్న సమారాధన చేపట్టారు. అలాగే 65వ వార్డు వెంకటాద్రిపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారికి పంచామృత, పండ్లరసాలతో అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ చేపట్టారు.

చిల్డ్రన్ హోమ్ చిన్నారులకు స్టడీ మెటీరియల్ అందజేత

గాజువాక, జూలై 22: గ్రేటర్ 73వ వార్డు పరిధి వుడా కాలనీలో గల కెజియా చిల్డ్రన్ హోమ్‌లో ఉంటున్న అనాథ పిల్లలకు బీటీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో హోమ్ చిన్నారులకు ఎటువంటి సహకారం అవసరం ఉన్నా చేస్తానని హామీ ఇచ్చారు. ఫౌండేషన్ ప్రతినిధులు హారిక, మణికంఠ పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన గోడ

పెదగంట్యాడ, జూలై 22: వర్షాలకు కణితి రోడ్డు సమీపంలో ఉన్న అంబేడ్కర్ కాలనీలోని ఓ ఇంటి గోడ కూలింది. డ్రైనేజీ పక్కనున్న ఈ గోడ కూలి సోమవారం ఉదయం డ్రైనేజీలో పడిపోయింది. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం వాటిల్లలేదు. డ్రైనేజీలో గోడ కూలిపోవడంతో మురుగు నీరంతా జామ్ అయిపోవడంతో ప్రజారోగ్యశాఖ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో గోడ శిథిలాలను తొలగించారు.

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

పారిస్ ఒలింపిక్స్ బాక్సింగ్ పర్యవేక్షకుడిగా వెంకటేశ్వరరావు


వెంకటేశ్వరరావు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జూలై 22: నగరానికి చెందిన ద్రోణాచార్య అవార్డు గ్రహీత (బాక్సింగ్) ఐ. వెంకటేశ్వరరావుకు అరుదైన గౌరవం దక్కింది. ఈనెల 26 నుంచి పారిస్‌లో జరిగే ఒలిం పిక్ గేమ్స్‌లో పాల్గొనే భారత బాక్సింగ్ జట్టు పర్యవేక్షకునిగా వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖతో పాటు బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బీఎఫ్ఐ) సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో పారిస్ ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరుగురు బాక్సింగ్ క్రీడాకారులను వెంకటేశ్వరరావు పర్యవేక్షించనున్నారు. అత్యంత ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో అబ్జర్వర్‌గా వ్యవహరిస్తున్న వెంకటేశ్వరావును ద ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ సంఘం ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

రెల్లి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు


శ్రీనివాసరావుకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

డాబాగార్డెన్స్, జూలై 22: జాతీయ రెల్లి ఎస్సీ గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా యర్రంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సంఘం జాతీయ అధ్యక్షులు భూపతి అప్పారావు సారథ్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ రెల్లి సామాజిక వర్గాన్ని చైతన్య పరుస్తూ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. జాతీయ అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ రానున్న అక్టోబర్‌లో రెల్లిలా జాతీయ మహాసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్.అప్పారావు, కె.వెంకటరావు, ఎం.సత్యనారాయణ, బి.కుమార్, చెన్నా శ్రీనివాసరావు, ఎ.వెంకట్రావు, పీర్రాజు, ఎన్.వెంకటరావు పాల్గొన్నారు.

సంఘ సేవకురాలు సత్యవతి ఇకలేరు..


సత్యవతి (ఫైల్‌ఫొటో)

డాబాగార్డెన్స్, జూలై 22: నగరానికి చెందిన సంఘ సేవకురాలు కోసూరు సత్యవతి (97) ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. ఆమెకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. సమాజహితాన్ని కోరిన ఆమె ఎంతో మంది నిరుపేదలను అక్కున చేర్చుకుని సేవలంచారు. తను పొందిన పింఛన్ , తన కుమారుడి సహకారంతో ఆమె జీవితాంతం ఆలయాలు, ఆశ్రమాలు, అనాథ శరణాయాలకు, స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా అందించారు. నిరాశ్రయులకు దుస్తులు అందజేశారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ ఆమెకు మనమడు. నగరానికి చెందిన పలువురు ప్రముఖులు ఆమె పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం ఉషోదయ జంక్షన్ వద్ద శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

28 నుంచి ఆలిండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలు

డాబాగార్డెన్స్, జూలై 22: ఆలిండియా ఆన్‌లైన్ డ్యాన్స్ పోటీలను ఈ నెల 29వ తేదీ నుంచి స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ విశాఖపట్నం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ ఆర్.జానకి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న సంప్రదాయ నృత్య కళాకారులను మరింత ప్రోత్సహించే ఉద్దేశంతో దేశభక్తి అంశంతోపాటు జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో డ్యూయెట్, గ్రూప్ విభాగాల్లో ఈ పోటీలు ఉంటాయన్నారు. జూనియర్స్, సీనియర్ బృంద విభాగాల్లో ఫైనల్స్ విజేతలకు ప్రథమ రూ. 50 వేలు, ద్వితీయ రూ. 25వేలు, తృతీయ బహుమతికి రూ. 15 వేల చొప్పున, అలాగే, ట్రోఫీలను అందజేయనున్నట్టు తెలిపారు. దేశభక్తి, జానపద, శాస్త్రీయ నృత్యాంశాల్లో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శనకు బహుమతులు, ట్రోఫీలను ప్రదానం చేస్తామన్నారు. ఈ వేడుకలో గ్రాండ్ ఫైనల్స్ విజేతలకు వికసిత్ భారత్ నృత్యట్రోఫీ 2024తో పాటు ప్రోత్సాహకాలను ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల వారు ఫోన్: 85229 90123ను సంప్రదించాలని కోరారు.

పోస్టర్ మేకింగ్ పోటీల్లో జాతీయ బహుమతులు


విద్యార్థికి అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

సీతమ్మధార, జూలై 22: ఇన్‌టచ్ సంస్థ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) నిర్వహించిన పోస్టర్స్ మేకింగ్ పోటీల్లో విశాఖపట్నం శ్రీ ప్రకాష్ విద్యా నికేతన్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఈ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పి.దుర్గప్రణిత హెరిటేజ్ ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్ సర్వీస్ ప్రోగ్రాం పెయింటింగ్ పోటీలో నా స్మారక శోధన అనే అంశాన్ని చిత్రించి జాతీయ స్థాయిలో విజేతగా నిలిచింది. ఎనిమిదో తరగతి విద్యార్థిని పి.హెచ్.భవజ్ఞ ప్రాంతీయ స్థాయిలో విజేతగా నిలిచారు. న్యూ ఢిల్లీలో నిర్వాహకులు దుర్గ ప్రణితిని సత్కరించి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ చిట్టూరి వాసు ప్రకాష్ విజేతలను అభినందించారు.

స్టీల్‌ప్లాంటు స్థలం స్వాధీనం


స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

విశాఖపట్నం, జూలై 22 (ఆంధ్రజ్యోతి): హెచ్‌బీ కాలనీలో స్టీల్‌ప్లాంటు భూమిని ఒకరు ఆక్రమించుకొని నిర్మాణం చేపట్టగా కోర్టు ఉత్తర్వులతో అధికారులు దానిని స్వాధీనం చేసుకున్నారు. హెచ్‌బీ కాలనీలో 17వ నంబరు ప్లాట్‌ను ఒకరు చాలా కాలం క్రితం కొనుగోలు చేశారు. ఆ స్థలానికి తూర్పున 15 గజాలు, పడమరన 77 గజాల స్టీల్‌ప్లాంటు స్థలాన్ని ఆక్రమించారు. ఈ విషయమై స్టీల్ ప్లాంటు టౌన్ ప్లానింగ్ విభాగం పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించారు. ప్లాంటుకు అనుకూలంగా ఉత్తర్వులు రావడంతో స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంటు అధికారులతో ఆక్రమణదారులు గొడవకు దిగారు. ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణం కొంత పడగొట్టారు. నిబంధనల ప్రకారమే స్థలం స్వాధీనం చేసుకున్నామని ప్లాంటు వర్గాలు తెలిపాయి.

బైక్ వెనుక కూర్చున్న వారికీ హెల్మెట్ ఉండాలి

▸▸ ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు


పోస్టర్లు అవిష్కరిస్తున్న పోలీసులు అధికారులు

మహారాణిపేట, జూలై 22: ద్విచక్ర వాహనదారుడితో సహా వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పకుండా ధరించాలని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో రోజూ చోటుచేసుకుంటున్న ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లో ఒకరిద్దరు మృతి చెందుతుండగా, పలువురు గాయాలపాలవుతున్నారన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించటం ప్రాణాంతకమని హెచ్చరించారు. ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాల్సిందేనన్నారు. ఈమేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నగరంలో సుమారు 44 ప్రధాన కూడల్లో ప్రచారం చేస్తామన్నారు. బీఐఎస్ మార్కు ఉన్న హెల్మెట్‌నే ధరించాలన్నారు. వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో ఏ ఒక్కరికి హెల్మెట్ లేకున్నా రూ. 1035 చలానా వసూలు చేస్తామన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, సంబంధిత వ్యక్తి డ్రైవింగ్ లైసెన్సు మూడు నెలలు పాటు సస్పెండ్ చేయనున్నట్టు చెప్పారు. మైనర్లకు వాహనం ఇస్తే.. తల్లిదండ్రులకు, లేదా ఆ వాహనదారులకు శిక్షకు గురవుతారన్నారు. బకాయి చలానాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

లద్దాఖ్‌కు బైక్ రైడ్‌చేసిన యువకుడికి సన్మానం


పర్వతారోహకుడు ఉస్మాన్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

వేపగుంట జూలై 22: ప్రపంచంలో అత్యంత ఎత్తయిన లద్దాఖ్ పర్వతశ్రేణిని బైక్‌పై అధిరోహించిన గోపాలపట్నం నాగేంద్ర కాలనీకి చెందిన ఉస్మాన్‌ను వేపగుంట మసీద్ ఈ క్యూబాలో స్థానిక యువకులు, నూతనంగా ఎన్నికైన బీసీ ముస్లిం సంఘ ప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ ఉస్మాన్ మాట్లాడుతూ తన డ్యూక్ బైక్‌పై నార్త్ ఈస్ట్ రాష్ట్రాలతోపాటు బంగ్లాదేశ్, చైనా, మియన్మార్, నేపాల్ దేశాల మీదుగా మూడు నెలల వ్యవధి లో ఈ ప్రయాణం సాగిందన్నారు. అలాగే, ప్రపంచంలో సముద్రమట్టానికి 19, 024 అడుగుల ఎత్తయిన ఉమిలింగాల ప్రాంతానికి చేరుకొని తిరిగి బైక్‌పైన గత జూలై 12న తిరిగివచ్చినట్టు చెప్పారు. ఈ యాత్రకు స్నేహితులు, కుటుంబ సభ్యులు ఎంతో సహకరించారన్నారు. ముస్లిం పెద్దలు, ఇతన సంఘాల నాయకులు ఉస్మాన్‌ను అభినందనలు తెలిపారు.

'మాతా శిశు మరణాల నియంత్రణే లక్ష్యం'

సీతంపేట, జూలై 22: మాతా శిశు మరణాల నియం త్రణ లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్ హెచ్‌వో పి.జగదీశ్వరరావు కోరారు. తన కార్యాలయంలో ఆయన జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని ఆశ వర్కర్ల నోడల అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమి సేవలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ మాతా శిశు మరణాల నియంత్రణ లక్ష్యంగా కేం ద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిల్కారి సేవలను అందులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియామాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ ద్వారా అందించేందుకు ప్రభుత్వ రూపకల్పన చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ రాజు లంకపల్లి పలు అంశాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఎస్.జీవన రాణి, డీపీవో బి.ఉమావతి, డీపీఎంవో కృష్ణకాంత్, ఆర్.మోహన్‌రావు, కె. ధర్మేంద్ర, ఐ. మనోరమ, శశిభూషణ్, మణికుమారి తదితరులు పాల్గొన్నారు.

'సెల్‌ఫోన్ సిమ్ విక్రయాల్లో సరైన పత్రాలు స్వీకరించాలి'

డాబాగార్డెన్స్, జూలై 22: సెల్‌ఫోన్ సిమ్స్ విక్రయించిన సమయంలో కొనుగోలుదారులకు సంబంధించిన సరైన ధ్రువపత్రాలను స్వీకరించాలని బీఎస్ఎన్ఎల్ పీజీఎంటీడీ పాల్‌విలియమ్స్, పీజీఎం ఆడమ్.జి పేర్కొన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో టెలికం శాఖ ఆధ్వర్యంలో టెలికాం పాయింట్ ఆఫ్ సేల్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డుపై ఇతరత్రా పుట్‌పాత్‌లపై సిమ్స్‌ను విక్రయించే వివిధ రకాల సిమ్స్‌ను సరైన ధ్రువపత్రాలు లేకుండా విక్రయించడంతో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందన్నారు. తప్పుడు డాక్యుమెంట్స్‌తో సిమ్స్ తీసుకునే వారు తదుపరి సైబర్‌క్రైమ్ చేసే అవకాశం ఉంటుందన్నారు. అందువల్ల జాగ్రత్తగా విక్రయించాలని సూచించారు.

వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ కార్యవర్గం

సిరిపురం, జూలై 22: సిరిపురంలోని వుడా భవన్‌లో వీఎంఆర్డీఏ స్టాఫ్ అండ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం జరిగింది. అధ్యక్షుడిగా ప్రసాద్, జనరల్ సెక్రటరీగా వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా శంకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా రవిశంకర్, రవికుమార్, అడిషినల్ సెక్రటరీగా రాజేష్, కోశాధికారిగా రమణారావు, ఉప కోశాధికారిగా రాము, సంయుక్త కార్యదర్శులుగా సాగర్, కిశోర్, నాగ గోవిందరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నవీన్, సూర్యనారాయణరాజు, భాస్కర్ ఎన్నికయ్యారు.

భీమ్‌నగర్‌లో కొళాయి ప్రారంభం

అల్లిపురం, జూలై 22: జీవీఎంసీ 32వార్డు పరిధిలోని భీమ్‌నగర్ స్థానిక దుర్గా దేవి ఆలయంలో సోమవారం వార్డు కార్పొరేటర్, దక్షిణ నియోజకవర్గ నాయకుడు కందుల నాగరాజు తాగునీటి కొళాయిని ఆయన ప్రారంభించారు. భక్తుల అవసరాల కోసం ఈ కొళాయి ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన నాయకులు ఈశ్వరరావు, ఆదినారాయణ, కందుల బద్రినాథ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయమూర్తులకు శిక్షణ


శిక్షణ ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి గిరిధర్

మహారాణిపేట, జూలై 22: కొన్ని కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వంపై వివిధ జిల్లాల న్యాయమూర్తులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం జిల్లా కోర్టు సముదాయంలో విశాఖ పట్నం, విజయనగరం శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన న్యాయమూర్తులు హాజరయ్యారు. ఈ నెల 26 వ తేదీ వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. విశాఖ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ప్రిన్సిపాల్ ఆలపాటి గిరిధర్, శ్రీకా కుళం జిల్లా జడ్జి జునైద్ అహ్మద్, విజయనగరం జిల్లా జడ్జి బీ సాయి కళ్యాణ్ చక్రవర్తి, న్యా యమూర్తులు యు.యు. ప్రసాద్, సీహెచ్ సురేందర్ సింగ్, ఎంవీ తక్‌చన్. ఎం. వెంకట శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమాజ దిక్సూచిగా సాహిత్యం

▸▸ ప్రముఖ వైద్య నిపుణుడు కూటికుప్పల సూర్యారావు


సాహితీవేత్తను సన్మానం చేస్తున్న మక్కెన ఫౌండేషన్ ప్రతినిధులు

సీతంపేట, జూలై 22: సమాజాన్ని సన్మార్గంలో పయనించేలా చేయగల శక్తి సాహిత్యానికి ఉందని ప్రముఖ వైద్య నిపుణుడు కూటికుప్పల సూర్యారావు పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మక్కెన రామసుబ్బయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో దశమ సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ నిర్వహించారు. విశాఖ సంస్కృతి మాస పత్రిక సంపాదకులు శిరేల సన్యాసిరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ కవులు, రచయితలకు డాక్టర్ మక్కెన శ్రీను సాహితీ పురస్కారాలను అందిస్తూ వారిని గౌరవిరచడం అభినందనీయమని అన్నారు. వి. రాజారామ్మోహన్‌రావు మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ చేయూనందించాలన్నారు. డాక్టర్ మక్కెన శ్రీను గత పదేళ్లగా తమ సంస్థ ద్వారా చేపట్టిన సాహిత్య కృషిని వివరించారు. అనంతరం పురస్కార గ్రహీతలైన డాక్టర్ ఎం.సుగుణరావు, లేదాళ్ళ రాజేశ్వరరావు, బండారు రాజ్‌కుమార్, కొమ్మల వెంకట సూర్యనారాయణ, ముని సురేష్ పిళ్ళైలను ఘనంగా సత్కరించారు. నగరానికి చెందిన పలువురు కవులు, రచయితలు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


గణేశ్వరరావు (ఫైల్)

గోపాలపట్నం, జూలై 22: మనస్తాపంతో ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రేటర్ పరిధి చంద్రనగర్‌లో కడలి గణేశ్వరరావు (31) కుటుంబ సభ్యులతోపాటు నివశిస్తున్నాడు. సోదరుడు సాంబశివరావుతో కలిసి తాటిచెట్లపాలెం వద్ద కార్పెంటర్ షాపు నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల గణేశ్వరరావుకు పలు పెళ్లి సంబంధాలు వచ్చినా కుదరక పోవడంతో రెండు నెలలుగా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన గణేశ్వరరావు సోమవారం మధ్యాహ్నం తాను ఉంటున్న ఇంటిపైన నిర్మాణంలో ఉన్న ఓ గదిలోనికి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని సోదరుడు ఫిర్యాదు మేరకు సీఐ సురేశ్ కుమార్, ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో మరొకరు..

భీమునిపట్నం: పట్టణంలోని బోయవీధికి చెందిన మత్స్యకార యువకుడు మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొక్కిరి ఎల్లాజీ (24)కి, అదే వీధికి చెందిన లావణ్యతో గత ఏడాది వివాహమైంది. వారికి ఏడు నెలల పాప వుంది. లావణ్య ప్రస్తుతం కన్నవారింట్లో ఉంటోంది. సోమవారం ఉదయం భార్య, పాపను చూసిన అనంతరం ఎల్లాజీ తన ఇంటికి చేరుకున్నాడు. మధ్యాహ్నం ఆయన సోదరుడు ఫోన్ చేసి గ్రామదేవత పండగ సమావేశానికి రావాలని కోరాడు. అప్పటికే అతను మద్యం సేవించి ఉండడంతో సమావేశానికి వెళ్లలేదు. సాయంత్రం సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పైడిరాజు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డుదారులకు రాగులు

▸▸ మసూరి కందిపప్పు పంపిణీకి అధికారుల ప్రతిపాదన

విశాఖపట్నం, జూలై 22(ఆంధ్రజ్యోతి): రేషన్ లబ్ధిదారులకు వచ్చే నెల నుంచి ఉచితంగా రాగులు అందజేయనున్నారు. కార్డుదారుల అభీష్టం మేరకు కిలో నుంచి గరిష్ఠంగా మూడు కిలోల వరకు పంపిణీచేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. అయితే ఆ మేరకు బియ్యం సరఫరాలో కోత విధిస్తారు. జిల్లాలోని ఎంఎల్ఎస్ పాయింట్లకు ఇప్పటికే 50 టన్నుల రాగులు చేరాయి. గతంలో కార్డుదారులకు రాగి పిండి అందజేశారు. ఎక్కువమంది తీసుకోకపోవడంతో పిండి పాడైంది. డీలర్లు నష్టపోవడంతో ప్యాకెట్లు వెనక్కి తీసుకున్నారు. అయితే పిండికి బదులు రాగులు పంపిణీచేయాలని భావించిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకున్నారు. కాగా కందిపప్పు పంపిణీకి టెండర్లు ఖరారు కాకపోవడంతో ప్రత్యామ్నాయంగా వచ్చేనెల నుంచి మసూరి కందిపప్పు (ఎరుపురంగులో ఉంటుంది) అందజేయాలని యోచిస్తున్నారు. జిల్లాలో 5.29 లక్షల కార్డుదారులకు నెలకు కిలో చొప్పున పంపిణీ చేసేందుకు 529 టన్నుల పప్పు అవసరం. మసూరి కందిపప్పు తీసుకోకపోతే ఇబ్బందులు తలెత్తుతాయని భావిస్తున్న అధికారులు, ప్రస్తుతం 50 టన్నుల సరకు తేవాలని యోచిస్తున్నారు.

వచ్చే నెల ఒకటోతేదీ నుంచి కార్డుదారులకు పంచదార పంపిణీ చేయలేమని అధికారులు చెబుతున్నారు. పంచదార టెండర్లు ఖరారు కాకపోవడంతో స్టాకు రాలేదన్నారు. ఇదిలావుండగా వచ్చేనెల ఒకటోతేదీ నుంచి పంపిణీ కోసం సోమవారం నుంచి డిపోలకు బియ్యం పంపిణీ ప్రారంభమయింది. జిల్లాలో 640 డిపోల పరిధిలో 5.29 లక్షల కార్డుదారులకు ఎనిమిదివేల టన్నుల బియ్యం అవసరమని జిల్లా పౌరసరఫరాల అధికారి సూర్యప్రకాశరావు తెలిపారు.

శిక్షా సప్తాహ్ వేడుకలు


టీఎల్ఎంలను పరిశీలిస్తున్న ఎంఈవో సోమేశ్వరరావు

కంచరపాలెం, జూలై 22 : నగరంలో అన్ని రకాల పాఠశాలల్లో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ వేడుకలు ప్రారంభమయ్యాయి. నూతన జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలల్లో సృజనాత్మక బోధనను అందించడానికి విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం అన్ని పాఠశాలల్లో విద్యార్థులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను తయారు చేసి ప్రదర్శన మేళాను నిర్వహించారు. స్థానిక జ్యోతినగర్, కంచరపాలెం, ఆర్పీపేట, తిక్కవానిపాలెం, ధర్మానగర్ పాఠశాలల్లోని ఈ వేడుకలను ఎంఈవో అంబటి సోమేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 23న పునాది అభ్యసన, సంఖ్యాశాస్త్రం, 24న క్రీడా దినోత్సవం, 25న సాంస్కృతిక దినోత్సవం, 26న సాంకేతిక నైపుణ్య దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు.

అక్కయ్యపాలెం: జాతీయ నూతన విద్యా విధానం నాల్గో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేశారు. అలాగే వాటిని విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. ఈ సందర్భంగా హెచ్ఎం కె.పద్మజ రాణి మాట్లాడుతూ లో పనికిరాని వాటిని సేకరించి తరగతికి అనుగుణమైన టీఎల్ఎంను విద్యార్థులతో తయారు చేయించామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

ఇన్‌స్పైర్ -మనక్ పోస్టర్ ఆవిష్కరణ

విశాఖపట్నం, జూలై 22: ఇన్నోవేషన్ ఇన్ సైన్స్ పర్స్యూట్ ఫర్ ఇన్‌స్పైర్డ్ రీసెర్చ్ (ఇన్‌స్పైర్)- మిలియన్ మైండ్స్ అగ్మెంటింగ్ నేషనల్ ఆస్పిరేషన్స్ అండ్ నాలెడ్జ్ (మనక్) పోస్టర్‌ను కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఈవో ఎల్.చంద్రకళ, జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాద్ పాల్గొన్నారు.

సవాళ్లు అనేకం

... 5వ పేజీ తరువాయి

తదుపరి ఉత్తర ప్రత్యుత్తరాలు కోర్టుతో జరపాల్సి ఉంటుంది. అదే సమయంలో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైంది. కౌన్సిల్‌లో ఇంతవరకూ వైసీపీకి మెజారిటీ ఉండడంతో ఎన్నికతోపాటు కౌన్సిల్ సమావేశాలు ఏకపక్షంగా జరిగిపోయేవి. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి రావడంతో జీవీఎంసీ కౌన్సిల్‌లో రాజకీయ పార్టీల బలాబలాలు మారిపోతున్నాయి. వైసీపీ కార్పొరేటర్లు 12 మంది ఆ పార్టీని వీడి టీడీపీ, జనసేనలో చేరారు. మరికొందరు కూడా అదేబాటలో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్టాండింగ్ కమిటీలోని పది స్థానాలను కూటమి దక్కించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే సమయంలో మేయర్ వైసీపీకి చెందిన వ్యక్తి కావడంతో కౌన్సిల్ సమావేశం కూడా రసాభాసగా జరిగే అవకాశం ఉంది. వీటన్నింటినీ అధిగమిస్తూనే నగర అభివృద్ధిపై కమిషనర్ దృష్టిసారించాల్సి ఉంటుంది. కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న సంపత్‌కుమార్ నగరంలో పరిస్థితులను అవగాహన చేసుకుంటూనే కౌన్సిల్‌లో రాజకీయ పార్టీలను సమన్వయం చేసుకుని నగరాభివృద్ధికి ప్రణాళికల రూపకల్పన, వాటి అమలు, జీవీఎంసీ ఆదాయం పెంచడానికి కృషిచేయాల్సి ఉంటుంది.

7న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నిక

... 5వ పేజీ తరువాయి

ప్రచురణ జరుగుతుంది. మూడో తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తారు. ఏడో తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటలు వరకూ జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని పాత కౌన్సిల్‌హాలులో పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

గరీబ్‌రథ్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

... 5వ పేజీ తరువాయి

ఎకానమీ కోచ్‌లలో మాదిరిగానే కంపార్టుమెంట్‌కు ఆరు బెర్తులు అందుబాటులో ఉంటాయి.

అత్యధిక అక్యుపెన్సీ రైళ్లలో ఒకటి

భారతీయ రైల్వేలో అత్యధిక ఆక్యుపెన్సీ ఉన్న రైళ్లలో ఒకటిగా గరీబ్‌రథ్ (12739/12740) గుర్తింపు పొందింది. 2008 అక్టోబరు 25న విశాఖలో పట్టాలెక్కిన గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ ఇప్పటికీ ఏడాది పొడవునా మంచి ఆక్యుపెన్సీతో రాకపోకలు సాగిస్తోంది.

ఏలేరు రిజర్వాయర్ కళకళ

... 5వ పేజీ తరువాయి

రైవాడ రిజర్వాయర్‌లో కూడా నీటిమట్టం పెరిగింది. గత నాలుగు రోజుల్లో రెండు మీటర్లు పెరిగింది. నాలుగు రోజులు కిందట 105.5 మీటర్లు ఉన్న నీటి మట్టం ప్రస్తుతం 107.5 మీటర్లకుపెరిగింది. దీనివల్ల నగరానికి తాగునీటి ఇబ్బందులు మరో ఆరు నెలలు వరకూ తొలగినట్టేనని అధికారులు ధీమా వ్యక్తంచేస్తున్నారు.

ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

ధ్రువీకరించారు. ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరిన నేపథ్యంలో 2014లో 'వారసత్వ సంపద'గా జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రకటించింది. భీమిలికి నైరుతిగా నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలు తూర్పు పడమరగా 20 మీటర్ల నుంచి రెండు కిలోమీటర్లు, ఉత్తర, దక్షిణగా ఒక కిలోమీటరు వెడల్పుగా విస్తరించాయని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా 2014లో ప్రకటించిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. అయితే భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తించిన ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. ఎర్రమట్టి దిబ్బలకు ఆనుకుని కొంత ప్రాంతం స్థానికులు ఆక్రమించుకుని జీడితోటలు పెంచుకుంటున్నారు. ఇంకా మట్టి మాఫియా యథేచ్ఛగా తవ్వకాలు జరిపింది. ముఖ్యంగా గడచిన ఐదేళ్లలో ఎర్రమట్టి దిబ్బలకు జరిగిన నష్టం చాలా ఎక్కువని స్థానికులు చెబుతున్నారు. ఇక భీమిలి సొసైటీకి ప్రభుత్వం కేటాయించిన 373.95 ఎకరాల్లో 91.5 ఎకరాలు ఎర్రమట్టి దిబ్బల్లో ఉండడం ప్రస్తుత వివాదానికి కారణమైంది. ఈ నేపథ్యంలో ఎర్రమట్టి దిబ్బలుగా గుర్తించిన ప్రాంతానికి సరిహద్దులు గుర్తించి రక్షణ కల్పించాలని కలెక్టర్ నిర్ణయించారు.

ప్రైవేటు ఆస్పత్రుల దోపిడీ

... 5వ పేజీ తరువాయి

యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నాయి.

ఠాగూర్ సినిమాను మరిపించేలా...

కొన్నాళ్ల కిందట వచ్చిన ఠాగూర్ సినిమాలో చనిపోయిన వ్యక్తికి ఓ కార్పొరేట్ ఆస్పత్రి వైద్యులు చికిత్స చేస్తారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు సీన్ క్రియేట్ చేసి...చివరకు ఎంత ప్రయత్నించినా ప్రాణం కాపాడలేకపోయామంటూ సమాధానమిస్తారు. అయితే అక్కడ హీరో బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాడు. నగర పరిధిలోని అనేక కార్పొరేట్/ప్రైవేటు ఆస్పత్రుల్లో ఈ తరహా సీన్లు నిత్యం దర్శనమిస్తుంటాయని బాధితులు చెబుతున్నారు.

అది బిల్లింగ్ హాస్పిటల్...

జిల్లా పరిషత్ సమీపంలోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో రోజుల వయసున్న చిన్నారి చికిత్సకు సుమారు మూడున్నర లక్షల బిల్లు వసూలు చేసిన యాజమాన్యం..ఆ తరువాత పరిస్థితి సీరియస్‌గా ఉందంటూ మరో ఆస్పత్రికి తరలించి చేతులు దులుపుకుంది. ఆ ఆస్పత్రికి వెళ్లిన వారెవరైనా రూ.లక్షల్లో బిల్లులు చెల్లించాల్సిందే. ఈ క్రమంలో దీనికి 'బిల్లింగ్ హాస్పిటల్' అన్న పేరు కూడా రావడం గమనార్హం. ఈ ఆస్పత్రి గురించి తెలియక ఎంతోమంది అక్కడికే వెళుతుంటారు. అలా వెళ్లిన వారి నుంచి రూ.లక్షలు వసూలు చేసి..అనేక సందర్భాల్లో చివరికి సారీ అంటూ రోగి బంధువులకు చెప్పిన దాఖలాలున్నాయని చెబుతుంటారు. ఈ ఆస్పత్రిలో జరుగుతున్న అన్ని వ్యవహారాలు ఆరోగ్యశాఖ అధికారులకు తెలిసినా..ఎవరూ ఫిర్యాదు చేయడం లేదంటూ చర్యలకు మీనమేషాలు లెక్కిస్తున్నారు.

రోగి పరిస్థితి చెప్పరు..

ప్రైవేటు/కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఒకసారి రోగిని చేర్పితే..ఆ తరువాత ఎప్పుడు బయటకు వస్తారో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంటోంది. ఎన్నిసార్లు అడిగినా రోగి కండిషన్ చెప్పరు. సీరియస్‌గా ఉందని, మెల్లగా కుదుటపడుతోందని, కనీసం నాలుగైదు రోజులు ఆస్పత్రిలోనే ఉంచాలని సిబ్బంది చెబుతుంటారు. నగదు చెల్లించే కేసుల్లో అయితే ఈ తరహా మాటలు విరివిగా వినిపిస్తుంటాయి. వీలైనంత దోచేసిన తరువాత మాత్రమే రోగిని మెల్లగా డిశ్చార్జ్ చేస్తారు. అదీ బాగుంటేనే. లేదంటే ఎమర్జెన్సీ సీన్ క్రియేట్ చేసి ఇతర ఆస్పత్రులకు తరలించి...తమకు ఇబ్బందుల్లేకుండా చేతులు దులిపేసుకుంటారు. అంతేకాదు ఆస్పత్రిలో ఉన్న రోగి వద్దకు బంధువులు, సహాయకులను అనుమతించారు. రోజులో ఒకటి, రెండుసార్లు మాత్రమే చూసి వెళ్లేందుకు పంపిస్తారు. అదేమని ప్రశ్నిస్తే ఇన్‌ఫెక్షన్ల వస్తాయని భయపెడుతుంటారు. పొరపాటున ఐసీయూ, వెంటిలేటర్‌లో ఉంచాల్సి వస్తే...రోజుకు ఇంత అని చొప్పున వసూలు చేయడంతోపాటు బెడ్, ఆక్సిజన్, నర్సింగ్ సిబ్బంది, వైద్యులు, మందులు ఇలా... ప్రతి దానికీ అదనంగా బిల్లులు వేసి ముక్కుపిండి మరీ వసూలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకున్నా మెరుగైన వైద్య సేవలు అందుతాయన్న ఉద్దేశంతో ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్న రోగులకు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నారు. ఈ ఆస్పత్రుల దందాలకు అడ్డుకట్ట వేయాల్సిన ఆరోగ్య శాఖ అధికారులు చోద్యంచూస్తున్నారు.

ప్రజాసమస్యలకు సత్వర పరిష్కారం: జడ్సీ కృష్ణ

జ్ఞానాపురం, జూలై 22: ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులను సత్వరమే పరిష్కరించాలని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ అధికారులకు అన్నారు. సోమవారం స్థానిక జోనల్ కార్యాలయంలో వినతులు స్వీకరించారు. పట్టణప్రణాళికా విభాగానికి 4, యూసీడీకి ఒకటి వచ్చినట్టు ఆయన తెలిపారు. సూపరెండెంట్ టి.ఎస్ఎన్.రాజు,ఇంజనీరింగ్ ఈఈలు వృత్స్యరాజు, ప్రసన్న, ఏసీపీ వెంకటరావు, టీపీఓ విజయ్‌కుమార్, వైద్యాధికారి సునీల్ కుమార్ పాల్గొన్నారు.



తులసీ దళార్చన చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా తులసీ దళార్చన

సింహాచలం, జూలై 22 : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం సహస్రనామ తులసీ దళార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ సహస్ర నామావళి పఠిస్తూ ప్రతి నామానికి పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు. తరువాత అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

రోడ్డుపై భవన నిర్మాణ సామగ్రి



రోడ్డులో వేసిన నిర్మాణ సామాగ్రి

వెంకోజీపాలెం, జూలై 22 : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీ శివాలయం పక్కనున్న మార్గంలో బిల్డింగ్ యజమాని నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. గత వారం రోజులుగా ఈ పరిస్థితి నెలకొంది. అసలే ఇరుకు రోడ్డు కావడం, అందులోనూ నిర్మాణ సామగ్రి రోడ్డుపై ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

సింహగిరిని కమ్మేసిన కారుమబ్బులు



సింహాచలం, జూలై 22 : సింహగిరిపై సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. రెండు రోజుల పాటు కొండపై భారీ వర్షం పడిన విషయం తెలిసిందే. మూడో రోజు జల్లులు పడుతూ దట్టమైన మేఘాలు కమ్ముకున్నాయి. ఒక దశలో పక్కపక్కనున్న మనుషులు కూడా కనిపించనంతగా చీకటి నెలకొంది. మరోవైపు చిరుజల్లులు,దట్టమైన మేఘాలతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనడంతో భక్తులు తమ సెల్‌ఫోన్లు, కెమెరాల్లో ప్రకృతి రమణీయ దృశ్యాలను క్లిక్‌మనిపించారు.

వేములవలసలో పారిశుధ్యం పనులు

ఆనందపురం, జూలై 22 : మండలంలోని వేములవలస పంచాయతీ పరిధిలోని పెందుర్తికి వెళ్లే రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు సోమవారం తొలగించారు. స్థానికంగా ఉన్న కొంతమంది వ్యాపారులు చికెన్, మటన్, కూరగాయల వ్యర్థాలను రోడ్డు పక్కన పడివేయడంతో తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో అటు వైపుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు పక్కన చెత్త పేరుకుపోయిన విషయాన్ని స్థానికులు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు స్పందించారు. ఈమేరకు ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పారిశుధ్య సిబ్బందితో అక్కడికి చేరుకుని జంగిల్ క్లియరెన్స్ చేసి, బ్లీచింగ్ చల్లించి పరిసరాలను శుభ్రం చేయించారు.

సినిమా గైడ్

- **డార్లింగ్ :** జగదాంబ, కిన్నెర, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీ నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), లక్ష్మి (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్-1 (పెందుర్తి)
- **భారతీయుడు-2 :** జగదాంబ, శారద, మెలోడి, రమాదేవి, సంగం, వెంకటేశ్వర-1, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లక్ష్మీకాంత్ కాంప్లెక్స్ (గాజువాక) శ్రీకన్య సినీపోలీస్ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ),
- **క్రైం రీల్ :** శ్రీకాంతి, సౌజన్య (గోపాలపట్నం),
- **కల్కి :** శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), శ్రీకన్య, గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **సారంగదరియా :** శ్రీవెంకటేశ్వర, మోహిని (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 36, టమాటా 58, వంకాయలు (తెలుపు) 40, వంకాయలు (నలుపు) 32, బెండకాయలు 18, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 42, బీరకాయలు 34, ఆనపకాయలు 16, కాలీఫ్లవర్ 42, క్యాబేజి 32, క్యారెట్ 30, దొండకాయలు 28, బంగాళదుంపలు 32, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 100, అల్లం (పాతది) 145, బరబటి 32, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 42, దోస కాయ 16, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 76, పొటల్స్ 38, కీరదోస 28, కాప్సికమ్ 62, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 38, కంద 62, దేముడు చిక్కుడు 82, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	92
ఫారం ధర	--	112
విత్ స్కిన్	--	194
స్కిన్‌లెస్	--	204

మరికొన్ని సిటీ వార్తలు పేజీ 1లో..



పద్మనాభంలో సచివాలయం ఎదురుగా పైపులైను లీకేజీ



రామ్‌నగర్‌లో రోడ్డుపై వరదలా ప్రవహిస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు

పల్లెల్లో వ్యాధుల భయం

వర్షాకాలం వచ్చిదంటే చాలు.. వ్యాధుల భయం వెంటాడుతోంది. గ్రామాల్లో ఇప్పటికే అంతంత మాత్రంగా ఉన్న పారిశుధ్యం గత నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారైంది. ఎక్కడ చూసినా.. చెత్తాచెదారం, కాలువల్లో పూడికలు, రోడ్లపై మురుగు నీరు కనిపిస్తోంది. దీంతో దోమల వ్యాప్తి అధికమై వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏటా వర్షాకాలంలో ఈ సమస్య నెలకొంటున్నా.. అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

- » వర్షాలకు పడకేసిన పారిశుధ్యం
- » ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్త
- » రోడ్లపైకి కాలువల్లోని మురుగు
- » దోమల వ్యాప్తితో విజృంభిస్తున్న జ్వరాలు

పద్మనాభం,జూలై 22 : పద్మనాభంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. కాలువల్లోని మురుగు నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విజయనగరం - సింహాచలం రోడ్డులోని పద్మనాభం జంక్షన్‌లో మురుగు నీరు రహదారి వెంబడి ప్రవహిస్తోంది. దీనికితోడు కొంతమంది దుకాణాల యజమానులు వినియోగిస్తున్న వృథా నీరు కూడా రోడ్డుపైకి విడిచిపెట్టడంతో సమస్యలు వస్తున్నాయి. దీన్ని నిరోధించడంలో పంచాయతీ పాలకవర్గం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే అనంతపద్మనాభస్వామి మెట్ల మార్గంలోని సీసీ రోడ్డులో కూడా మురుగు నీరు రోడ్డుపైకి వస్తోంది. శివాలయానికి, అనంతుని గిరికి వెళ్లే భక్తులు ఈ మురుగు నీటిని తొక్కుకుంటూ ఆలయాలకు వెళ్లాల్సి వస్తోంది. ఈ మార్గంలో కొంతవరకు కాలువలు ఉండగా మిగిలిన భాగంలో కాలువలు లేవు. మెట్ల మార్గంలోని కల్వర్టు కూడా మూసుకుపోవడంతో కాలువల్లో మురుగునీరు నిలిచిపోయింది. దీంతో దోమల బెడద ఎక్కువ అవుతోంది. మురుగునీరు నిలిచిపోయిన ప్రదేశంలో మంచినీటి బోర్లు ఉన్నాయి. దీంతో తాగునీరు కలుషితమై డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

వీధుల్లోకి మురుగు నీరు



ఓ ఇంటి ముందు నిలిచిన మురుగు నీరు

రామ్‌నగర్ : రామ్‌నగర్‌లోని పలు వీధుల్లో మురుగు నీరు పొంగిపొర్లుతోంది. దీంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వారం రోజులుగా ప్రధాన రహదారుల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నుంచి మురుగు నీరు రోడ్ల మీదకు వస్తోంది. ఆ నీటిలోనే పాదచారులు, వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారు. మురుగు నీరు ఇళ్ల వద్ద నిలిచి ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ఎక్కడ వ్యాధులు ప్రబలుతాయోనని ప్రజలు భయపడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించాలని కోరుతున్నారు.

బురదమయంగా లోతట్టు ప్రాంతాలు



మెయిన్ రోడ్‌లో మురుగునీరు

భీమునిపట్నం : పట్టణంలో వారం రోజులుగా పడుతున్న వర్షాలకు పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. లోతట్టు ప్రాంతాలు బురదమయమయ్యాయి. మెయిన్ రోడ్‌లో కాలువలపై శ్లాబ్‌లు వేయడంతో మురుగు నీరు వెళ్లే మార్గం లేక రోడ్లపైకి వచ్చి చేరుతోంది. సీబీఎం స్కూల్ రోడ్‌లో కల్వర్టుపై, రామాద్రి వద్ద వర్షం నీరు నిలిచి పోతుండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు.



వైద్య సిబ్బందితో ఏయూ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు

ఏయూ ఉద్యోగులకు దంత వైద్య పరీక్షలు

వెంకోజీపాలెం, జూలై 22 : ఏయూ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో గీతం డెంటల్ కళాశాల, ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 70 మందికి పరీక్షలు చేసి, మందులు అందజేశారు. కార్యక్రమంలో డెంటల్ కళాశాల ప్రొఫెసర్, హెచ్‌ఓడీ మనీష్, వైద్యులు డాక్టర్ లయ, జరీనా, రమ్యశ్రీ, జశ్వంత్ రెడ్డి, ఖ్యాతిదేవి, నితిన్, నవ్య, సొసైటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ వి. సిద్దయ్య, ఉపాధ్యక్షుడు సీహెచ్ లక్ష్మణబాబు, కార్య దర్శి షేక్ ఖాదిర్ బాబా, సహాయ కార్యదర్శి కె. సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'యూపీపీఎస్సీ పరీక్షల్లో దివ్యాంగుల కోటా వద్దనడం అన్యాయం'

వెంకోజీపాలెం, జూలై 22 : సివిల్ సర్వీస్ ఉద్యోగాల నియామకంలో దివ్యాంగులకు కోటా వద్దని సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ పేర్కొనడం అన్యాయమని రాష్ట్ర దివ్యాంగుల రైట్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం. సురేష్ మీనన్ అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వికలాంగులు ఏ రంగంలో ఫిట్ అవుతారో ఆ రంగంలోనే ఉద్యోగాలు ఇస్తారని, సివిల్ సర్వీసుల్లో కూడా తమకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు.మెడికల్ రంగంలో కూడా ద్వివ్యాంగులకు మెరుగైన అవకాశాలు ఉన్నాయని, సాంకేతిక పరిజ్ఞానం తమకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాజకీయ రంగంలో పార్లమెంట్, అసెంబ్లీలో తమకు రావాల్సిన స్థానాలకు రిజర్వేషన్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతామని చెప్పారు. అన్ని రంగాల్లోనూ దివ్యాంగులను ప్రోత్సహించాలని ఆయన కోరారు.

మద్యం దుకాణం వద్దని వినతి

తగరపువలస, జూలై 22 : జీవీఎంసీ రెండవ వార్డు తగరపువలస గొల్లవీధి ఎన్‌టీఆర్ విగ్రహం ఎదురుగా మద్యం దుకాణం ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని కోరుతూ సీఐటీయూ నాయకులు ఎక్సైజ్ అధికారులకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్లవీధిలో కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు ఆ ప్రాంత మహిళలు తమ దృష్టికి తీసుకువచ్చారని, అక్కడ మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే అనేక ఇబ్బందులు వస్తాయని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మూర్తి, నీలాతి రాము, దువ్వి రమణ, కంచిబోని నరసింగరావు, స్థానిక మహిళలు డి. కృష్ణవేణి, కొండమ్మ, సంతోషి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ

తగరపువలస, జూలై 22 : జీవీఎంసీ రెండో వార్డు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణీ స్త్రీలకు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి సోమవారం పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈమేరకు సంతపేటలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో గర్భిణుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే డెక్కతిపాలెం, రాయపాలెం, మామిడిపాలెం, నమ్మివానిపేట, వలందపేట, రాజులింగంపేట కేంద్రాల్లోనూ పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటరావు, మహేష్, గణేష్‌రెడ్డి, సూర్యనారాయణ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

భీమునిపట్నం, జూలై 22 : పట్టణంలోని బోయవీధికి చెందిన మత్స్యకార యువకుడు మద్యం మత్తులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. కొక్కిరి ఎల్లాజీ (24)కి, అదే వీధికి చెందిన లావణ్యతో గత ఏడాది వివాహమైంది. వారికి ఏడు నెలల పాప వుంది. లావణ్య ప్రస్తుతం కన్నవారింట్లో ఉంటోంది. సోమవారం ఉదయం భార్య, పాపను చూసిన అనంతరం ఎల్లాజీ తన ఇంటికి చేరుకున్నాడు. మధ్యాహ్నం నాలుగున్నర సమయంలో ఆయన సోదరుడు ఫోన్ చేసి గ్రామదేవత పండగ సమావేశానికి రావాలని కోరాడు. అప్పటికే అతను మద్యం సేవించి ఉండడంతో సమావేశానికి వెళ్లలేదు. సాయంత్రం ఐదున్నర గంటల ప్రాంతంలో సోదరుడు ఇంటికి వెళ్లి చూడగా చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ పైడిరాజు ఆత్మహత్య కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

'గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి'

వెంకోజీపాలెం, జూలై 22 : ఏయూలో తొలగించిన 250 మంది గెస్ట్ లెక్చరర్లను మళ్లీ విధుల్లోకి తీసుకోవాలని, అలాగే కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఏయూ పరిరక్షణ సమితి సభ్యులు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ జి. శశిభూషణరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిఫికేషన్ లేకుండా యూనివర్సిటీలో నియమించిన అడంక్ట్ అండ్ ప్రొఫెసర్ ఇన్ ప్రాక్టీస్‌లను వెంటనే తొలగించాలని, ఎయి డెడ్ ఫ్యాకల్టీని తమ కళాశాలలకు పంపించాలని, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులు బ్యాక్ ల్యాగ్ పోస్టులను భర్తీ చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆట అధ్యక్షుడు ప్రొఫెసర్ జాలాది రవి, ప్రొఫెసర్ ప్రేమానందం, ప్రొఫెసర్ నల్ల సత్యనారాయణ, ప్రొఫెసర్ జర్ర అప్పారావు, ప్రొఫెసర్ మునిస్వామి, డాక్టర్ ధనరాజ్, డాక్టర్ ఏడుకొండలు, డాక్టర్ సురేష్ మీనన్, డాక్టర్ జీకేడీ ప్రసాద్, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తాటితూరులో 200 మందికి వైద్య పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

భీమునిపట్నం (రూరల్), జూలై 22 : మండలంలోని తాటితూరు గ్రామంలో విశాఖ మెడికవర్ ఆసుపత్రి వైద్యులు సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు 200 మంది రోగులను పరీక్షించి, మందులు అందజేశారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ సిరుగుడి సంతోషికుమారి ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ పతివాడ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోబోటిక్ వైద్య విధానంలో మోకాళ్లకు శస్త్ర చికిత్స

ఆరిలోవ, జూలై 22 : ఆరిలోవలోని హెల్త్ సిటీలో ఉన్న కేర్ ఆస్పత్రిలో రోబోటిక్ వైద్య విధానంలో మోకాళ్లకు శస్త్ర చికిత్స చేయనున్నట్టు ఆర్థోపెడిక్ సర్జన్ జి. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. క్యూవిస్ జాయింట్ రోబోటిక్ సర్జరీ విధానం ద్వారా అత్యాధునిక పద్ధతిలో కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స చేయడం వల్ల రోగికి ఎటువంటి ఆపరేషన్ ఉండదన్నారు. దీనివల్ల రోగి త్వరగా కోలుకుంటారని చెప్పారు. ఇది వైద్య శాస్త్ర సాంకేతిక విధానంలో ఒక కొత్త ఒరవడి అన్నారు. ఈ వైద్యానికి సుమారు రెండున్న లక్షల ఖర్చు అవుతుందని, 20 ఏళ్ల పాటు రోగికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు. విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌదరి, రోబోటిక్ ఆర్థో సర్జన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, రాజేష్, శాంతిరెడ్డి ఉన్నారు.



జడ్సీకి వినతిపత్రం అందిస్తున్న 4వ వార్డు టీడీపీ నాయకులు

కె.నగరపాలెంలో పార్క్ ఏర్పాటు చేయాలని వినతి

భీమునిపట్నం, జూలై 22 : జీవీఎంసీ 4వ వార్డు కె. నగరపాలెంలో పార్క్ ఏర్పాటు చేయాలని కోరుతూ వార్డు టీడీపీ అధ్యక్షుడు పాసి నరసింగరావు జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మికి సోమవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలెంలో పార్క్ ఏర్పాటుకు స్థలం వుందని, నిధులు మంజూరు చేయాలన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచనల మేరకు ఈ వినతిపత్రం అందిస్తున్నామని చెప్పారు. అలాగే వ్యాయామ పరికరాలతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోతిన అప్పలరాజు, మరుపిళ్ళ రాజేంద్రప్రసాద్, పాసి త్రినాథ్ కుమార్, తొత్తడి సూర్య, నాగోతి ఏడుకొండలు పాల్గొన్నారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఆరు అర్జీలు అందాయని, వాటిలో రెండు పట్టణ ప్రణాళికా విభాగానికి, నాలుగు ఇంజనీరింగ్ విభాగానికి వచ్చినట్టు జడ్సీ తెలిపారు.

జోన్-2 కార్యాలయానికి 20 ఫిర్యాదులు

కొమ్మాది, జూలై 22 : జీవీఎంసీ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 20 ఫిర్యాదులు అందినట్టు జడ్సీ శైలజావల్లీ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 6, ఇంజనీరింగ్ విభాగానికి 4, రెవెన్యూ 4, యూసీడీ 2, పబ్లిక్ హెల్త్ 2, విద్యుత్ విభాగానికి 2 ఫిర్యాదులు అందాయన్నారు. వాటిని ఆయా శాఖలకు అందజేసి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించానని చెప్పారు.

వెంకన్న సన్నిధిలో శ్రవణ నక్షత్ర హవనం



హోమం చేస్తున్న అర్చకులు

సింహాచలం, జూలై 22 : వరాహలక్ష్మీనృసింహస్వామి కొండ దిగువ పూదోటలో ఉన్న పద్మావతి అలివేల్‌మంగా సమేత వెంకటేశ్వరస్వామి సన్నిధిలో సోమవారం శ్రవణం నక్షత్ర హవనం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి సేవా కాలం, తీర్థగోష్ఠి జరిపారు. అనంతరం యజ్ఞ భగవానుడు సుదర్శనుడ్ని ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో అర్చకులు భార్గవ్, రఘు లోకకల్యాణార్థం అన్న సంకల్పంతో శ్రీకారం చుట్టి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. శాస్త్ర విధానంలో బింబారాధన, మండపారాధన, కలశారాధన చేసి, హోమ కుండంలో అగ్ని ప్రతిష్ఠాపన చేశారు. అనంతరం పంచసూక్తాలతో సుదర్శన నారసింహ మూలమంత్రాలతో హవనాన్ని జరిపారు. పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులు స్పృశించిన తరువాత మహా పూర్ణాహుతి చేసి పూర్ణ కలశంతో అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేశారు. తరువాత అంతరాలయంలో కలశాన్ని ఉంచి ఆ జలాలతో భక్తులను ప్రోక్షణ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తంగా ఉండాలి

భీమునిపట్నం (రూరల్), జూలై 22 : వరదలు, తుఫానులు, భూకంపాలు వంటివి వచ్చినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నేషనల్ డిఫెన్స్ రిజర్వు ఫోర్సు (ఎన్‌డీఆర్ఎఫ్) కమాండర్ పి. ఈశ్వరరావు సూచించారు. సోమవారం ఆయన తాటితూరు గ్రామస్తులకు విపత్తుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిడుగులు పడినప్పుడు, విష వాయువులు విడుదలైనప్పుడు ప్రజలు ఎవరి మట్టుకు వారు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇతరులను రక్షించడానికి కూడా చూడాలని చెప్పారు. రక్తస్రావం జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సదస్సులో తహసీల్దార్ గోవిందరావు, సర్పంచ్ సంతోషికుమారి, దళిత నాయకులు పతివాడ రాంబాబు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉధృతంగా గోస్తనీ



నిండుగా ప్రవహిస్తున్న నది

పద్మనాభం (రూరల్), జూలై 22 : మండలంతో పాటు ఎగువ ప్రాంతాల్లో వారం రోజులుగా పడుతున్న వర్షాలకు గోస్తనీ నదిలో భారీగా వరద నీరు చేరుతోంది. దీంతో నది నిండుగా ప్రవహిస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పొట్నూరు, వీకే పాలెం, మద్ది, కృష్ణాపురం, కురపల్లి, రేవిడి, పాండ్రంగి, సామయ్యవలస గ్రామాలతో పాటు ఆనందపురంలో బోని, భీమిలిలో తాటితూరు, మజ్జివలస, నగరపాలెం గ్రామాల మీదుగా నది ప్రవహిస్తుంది. కురపల్లి వద్ద ఏటి కాలువ నిర్మాణం వల్ల అక్కడ కొంతమేర నీరు నిల్వ ఉంటుంది. నదిలో నీరు పుష్కలంగా ఉండడంతో ఖరీఫ్ పంటలకు ఢోకా ఉండదని రైతులు చెబుతున్నారు.

చంద్రబాబునాయుడుకు గవర్నర్ కితాబుపై హర్షం

సిరిపురం, జూలై 22 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును గవర్నర్ నజీర్ విజనరీ నాయకుడు అని ప్రశంసించడం పట్ల తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ హర్షం వ్యక్తం చేశారు. సోమవారం ఆయన సిరిపురంలోని ఓ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు గురించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చెప్పిన మాటలు అక్షర సత్యాలు అన్నారు. గవర్నర్ ప్రసంగాన్ని జగన్ అండ్ కో అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలిపారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే అక్రమాలు జరిగాయంటూ ఢిల్లీలో ఫొటో ఎగ్జిబిషన్ పెట్టేందుకు జగన్ సిద్ధమవు తున్నాయని, ఆ ఫొటో ఎగ్జిబిషన్‌కు వైసీపీ వాళ్లు తప్ప ఎవరూ రారని ఎద్దేవా చేశారు.

శిక్షా సప్తాహ్ వారోత్సవాలు ప్రారంభం



కాపుల దిబ్బడిపాలెం పాఠశాలను సందర్శించిన డీఈఓ చంద్రకళ

భీమునిపట్నం, జూలై 22 : జాతీయ విద్యా విధానాన్ని ప్రారంభించి నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా భీమిలిలోని డైట్ కళాశాలలో సోమవారం నుంచి శిక్షా సప్తాహ్ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయులు అమరావతి, సర్వ శిక్షాభియాన్ ఆదేశాల మేరకు టీఎల్ఎం (టీచర్ లెర్నింగ్ మెటీరియల్) మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ ఎం. జ్యోతికుమారి, తదితరులు పాల్గొన్నారు. అలాగే 4వ వార్డు కాపుల దిబ్బడిపాలెం ఎంపీపీ పాఠశాలను డీఈఓ చంద్రకళ సందర్శించి, పాఠశాల హెచ్ఎం వై.యర్రాజి ఆధ్వర్యంలో నిర్వహించిన టీఎల్ఎం మేళాను, విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష ఏపిడి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. జీవీఎంసీ పీఎస్ఎం హైస్కూల్‌లోనూ టీఎల్ఎం మోడల్స్ తయారు చేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి, హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్లు మాణిక్యంనాయుడు, హెచ్ఎం శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పలు గ్రామాల్లో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలిరోజు స్థానిక వనరులతో బోధనా సామగ్రిని ప్రదర్శించారు.

తగరపువలస : బంగ్లామెట్ట పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం నూతన విద్యా విధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈమేరకు తొలిరోజు విద్యా వారం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ తేదీలు మార్చాలి

ఆరిలోవ : రాష్ట్రంలో ఈనెల 22 నుంచి 28 వరకు జరుగుతున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాల నిర్వహణ తేదీల్లో కొన్ని మార్పులు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ముద్దు శ్రీను సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 28న ఆదివారం కావడం వల్ల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉంటుందని, ఆ రోజు జరిగే కార్యక్రమాన్ని 29వ తేదీ నాడు చేపట్టాలని ఆయన కోరారు.

ఘనంగా భూలోకమాత తొలేళ్లు

వెంకోజీపాలెం, జూలై 22 : కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారి పక్కనున్న భూలోకమాత అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా జరిగింది.గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి వార్షిక పండగ జరగనున్నట్టు సంఘం అధ్యక్షుడు పీల కనకరాజు తెలిపారు.

చెరువు చేపలకు గిరాకీ

భీమునిపట్నం (రూరల్), జూలై 22 : మండలంలో చెరువు చేపలకు గిరాకీ పెరిగింది. దీంతో సంప్రదాయ మత్స్యకారులు వీటి పెంపకంపై ఆసక్తి చూపుతున్నారు. మత్స్యశాఖాధికారులు 20 నుంచి 40 మందితో సొసైటీలు ఏర్పాటు చేసి వారి ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు. మండలంలో ఇప్పటివరకు ఆరు సొసైటీలు ఉన్నాయి. వీరి ద్వారా గంభీరం, పాండ్రంకి, మజ్జివలస తదితర ప్రాంతాల్లో 14 చెరువులను గుర్తించి మత్స్యశాఖ చేపల పెంపకం చేపడుతోంది. చెరువుల్లో చేప పిల్లలు వేసిన రెండు నెలల్లోనే పెద్ద సైజులో అందుబాటులోకి వచ్చి, లాభాలు తెచ్చిపెడుతున్నాయి. సముద్రం చేపలకు ఎంత డిమాండ్ ఉందో వీటికి కూడా అంతే డిమాండ్ ఉంది. కిలో రూ.200 వరకు విక్రయిస్తున్నారు. తగరపువలస, మజ్జివలస, ఆనందపురం, బోయిపాలెం తదితర ప్రాంతాల్లో వీటి అమ్మకాలు ఎక్కువగా జరుగుతున్నాయి. మత్స్యకార సొసైటీలు నగరంలోని పెద్ద పెద్ద హోటళ్లకు ముందుగా తీసుకున్న ఆర్డర్ల మేరకు చేపలను సరఫరా చేస్తున్నారు.

జీవీఎంసీ హైస్కూల్‌లో డిజిటల్ క్లాస్ రూమ్

భీమునిపట్నం, జూలై 22 : పట్టణంలోని నెహ్రూ రోడ్‌లో వున్న జీవీఎంసీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ క్లాస్ రూమ్‌ను ఆ పాఠశాల హెచ్ఎం సీహెచ్ సింహాచలం సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఫ్ఎక్స్‌బీ ట్రస్ట్ విద్యార్థుల కోసం ఎల్ఈడీ టీవీ, ల్యాప్‌టాప్, వైఫై రూటర్ తదితర పరికరాలను వితరణగా అందజేసిందన్నారు. వీటితో డిజిటల్ క్లాస్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నయీమ్, అల్లాడ శ్రీనివాసరావు, ఐ. వెంకటరావు, రామకృష్ణ, వైవీ రవి కుమార్, మజ్జి సునీత పాల్గొన్నారు.